# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 12-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:243 పేజిలు:6 వెల: రూ.1/-


## శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఎన్నిక

విజయవాడ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి శాసన సభాపక్ష సమావేశం విజయవాడ-ఏ కన్వెన్షన్ లో ప్రారంభమైంది కూటమి తరఫున గెలుపొందిన ఎంఎల్ఏలు ఈ సమావేశానికి హాజరయ్యారు. వారంతా నారా చంద్రబాబు నాయుడును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు పేరును ప్రతిపాదించారు. చంద్రబాబును కూటమి శాషనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ఏకగ్రీవ తీర్మానాన్ని కూటమి నేతలు గవర్నర్ కు పంపబోతున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ కూటమికి ఆహ్వానం పంపనున్నారు. నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాగా తనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు టిడిపి అధినేత ధన్యవాదాలు తెలిపారు.

### చురక

ప్రజాస్వామ్య లౌకిక
పరిరక్షణ విధానం
ప్రభుత్వంలో ఎన్డీయే
పక్షాలకు ప్రధానం
హామీలను విస్మరించి
అడుగువేస్తే ప్రమాదం
ఎన్నేళ్లు పాలించినా
ఎక్కడుండు జన మోదం

-వేల్పుల నారాయణ
9440433475



# త్వరలో ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు : మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జూన్ 10 :అతి త్వరలో తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డును తమ ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలియజేశారు. అమెరికా పర్యటనలో భాగంగా గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ వాషింగ్టన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ప్రవాస భారతీయులు పుట్టిన ఊరుకు మేలు చేసే విధంగా గ్రామ పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు. కేరళలో ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు విజయవంతంగా నడుస్తుందని అంతకన్నా మిన్నగా తెలంగాణ ప్రవాస భారతీయ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో పెద్దపల్లి జిల్లాలో 1000 కోట్లతో కోకకోల మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూతపడిన నిజాం సుగర్ ఫ్యాక్టరీని ఏడాదిలోగా తెరిచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

చెరువు రైతులకు మేలు చేయడంతో పాటు ఆ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. హైదరాబాద్ లోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర నలుమూలల ఫైబర్ నెట్వర్క్ అందుబాటులో ఉందని, ప్రవాస భారతీయులు పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలన్నారు.

హైదరాబాద్ నగరానికి పరిమితం కాకుండా పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. మూసి రివర్ ఫ్రంట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాదును ఏఐ క్యాపిటల్ గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ విస్తరణకు తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ప్రవాస భారతీయులు పుట్టిన గడ్డకు మేలు చేసే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ వాషింగ్టన్ ఫౌండర్ చైర్మన్ విశ్వేశ్వర్ రెడ్డి తో పాటు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

## విమాన ప్రమాదంలో మలావీ ఉపాధ్యక్షుడు పాటు తొమ్మిది మంది దుర్మరణం

న్యూఢిల్లీ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా (51) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన భార్యతో సహా విమానంలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం మంగళవారంనాడు ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. సంఘటన వివరాల ప్రకారం, మలావీ మాజీ అటార్నీ జనరల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు చిలిమా సహా మరో తొమ్మిది మంది సైనిక విమానంలో ప్రయాణిస్తుండగా సోమవారం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్తర నగరమైన జుజులో విమానం ల్యాండ్ కావడంలో విఫలమైంది. దీంతో రాజధాని లిలాంగ్వేకి తిరిగి రావాలని సందేశం అందింది. కానీ విమానం తిరిగి రాకుండానే అదృశ్యం కావడంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు పర్వత ప్రాంతంలో విమానం శకలాలను కనుగొన్నారు. ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడకపోవడంతో మలావీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇది అత్యంత హృదయవిదాకరమైన సంఘటన అని, ఈ విషయం తెలియజేయడానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చక్వేరా తెలిపారు.

# ఆహారంలో కల్తీ చేస్తే కఠిన చర్యలు.. దామోదర్ రాజనర్సింహా

### -హోటల్స్ యాజమాన్యాలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ వార్నింగ్
### -నేడు హోటల్స్ అసోసియేషన్స్ ప్రతినిధులతో భేటి
### -నాణ్యత లేని ఆహారంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కు డ్యామేజ్

హైదరాబాద్, జూన్ 10 :ఆహారం కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. హోటల్స్ అసోసియేషన్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్ ను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతున్నామన్నారు. హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి వర్క్ షాప్ ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించారు.

కాగా, భాగ్యనగరంలో పెద్ద పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. నాసిరకం ఆహారం సరఫరా చేస్తూ వినియోగదారుల జేబులు ఖాళీ చేయడమే కాకుండా.. వారి ఆరోగ్యాన్ని కూడా హోటళ్ల నిర్వాహకులు నాశనం చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు గత కొన్ని రోజులుగా హైదరాబాద్ లోని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ ఫ్రిజ్ లలో నిల్వ ఉంచి, కాలం చెల్లిన మాంసం, వస్తువులను వంటకు వినియోగిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి దామోదర్ రాజనర్సింహ హోటల్స్ ప్రతినిధులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

# చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చివరి దశకు చేరుకున్న ఏర్పాట్లు

### -ప్రధాని మోడీతో పాటు ఎన్డీఏ కూటమి సీఎంలు, దేశవ్యాప్తంగా ప్రముఖులు హాజరు
### -లక్షన్నరకు పైగా ప్రజలు వచ్చే అవకాశం
### -60 వేల మందికి సరిపడేలా మైదానంలో కుర్చీలు ఏర్పాటు
### -పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు

గన్నవరం జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఈనెల 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి జరుగుతున్న ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. కార్యక్రమానికి ప్రధాని మోడీ ఎన్డీఏ కూటమి సీఎంలు, దేశవ్యాప్తంగా ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో 80అడుగుల వెడల్పు, 50అడుగుల పొడవు, 8అడుగుల ఎత్తుతో సిద్ధం చేస్తున్న వేదిక పనులు చివరి దశకు చేరుకున్నాయి. వేదికపై భారీ ఎల్ఈడీ తెరలు, సభను వీక్షించేందుకు టెంటుల్లో ప్రత్యేక ఎల్సీడీలు ఏర్పాటు చేస్తున్నారు. 60 వేల మందికి సరిపడేలా మైదానంలో కుర్చీలు ఏర్పాటు చేశారు. అంతకుమించి వస్తే బయటే ఉండాల్సి రావడంతో వారి కోసం ప్రత్యేక డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి లక్షన్నరకు పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని పార్టీ



వర్గాలు అంచనా వేస్తున్నాయి. పదివేల వాహనాలకు సరిపడా 30చోట్ల పార్కింగ్ ప్రదేశాలను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ప్రధాని మోడీ ప్రయాణించే మార్గంలో ప్రత్యేక బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వీవీఐపీ, వీఐపీలు కూర్చునే గ్యాలరీలకు ఇన్‌ఛార్జ్‌లుగా జిల్లాస్థాయి అధికారులను నియమించారు. ప్రతీ గ్యాలరీలో నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య బృందాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తాత్కాలిక వైద్య శిబిరాలు నిర్మించారు. రామవరప్పాడు నుంచి గన్నవరం వెళ్లేందుకు కేవలం పాసులు ఉన్న వారికి మాత్రమే పోలీసులు అనుమతి ఇస్తున్నారు.

# జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్ కళ్యాణ్ ఎన్నిక



అమరావతి జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్ కళ్యాణ్ ఎన్నికయ్యారు. మంగళవారం ఉదయం మంగళగిరి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభపక్ష నేతగా పవన్ పేరును తెనాలి ఎమ్మెల్యే నాదేండ్ల మనోహర్ ప్రతిపాదించారు. జనసేన ఎమ్మెల్యేలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కాగా, అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో జనసేన పార్టీ తరుపున పోటీ చేసిన 21 ఎమ్మెల్యే అభ్యర్థులు, ఇద్దరు ఎంపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో జనసేన వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించి ఏపీలో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుచి 71 వేల భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి మళ్లీ దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 11 :రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి తెలంగాణ ప్రభుత్వం మళ్లీ దరఖాస్తుల ఆహ్వానిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తులను పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సీఎస్ పేర్కొన్నారు.

# జూన్ 24 నుంచి జులై 3 వరకూ పార్లమెంట్ సమావేశాలు

న్యూ డిల్లీ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మోదీ 3.0 కేబినెట్ కూర్పు కూడా పూర్తైంది. మొత్తం 71 మంది ఎంపీలకు మంత్రులుగా అవకాశం దక్కింది. వీరందరికీ శాఖలు కూడా కేటాయించడంతో ఇవాళ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేంద్రం పార్లమెంట్ సమావేశాలకు పిలుపునిచ్చింది. ఈ సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక, కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఎనిమిది రోజులపాటు ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకూ ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు వెల్లడించాయి. ఇందులో భాగంగా జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. జూన్ 24, 25 తేదీల్లో కొత్త పార్లమెంట్ సభ్యులు ప్రమాణం స్వీకారం చేస్తారని సదరు వర్గాలు తెలిపాయి.

న్యూ డిల్లీ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మోదీ 3.0 కేబినెట్ కూర్పు కూడా పూర్తైంది. మొత్తం 71 మంది ఎంపీలకు మంత్రులుగా అవకాశం దక్కింది. వీరందరికీ శాఖలు కూడా కేటాయించడంతో ఇవాళ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేంద్రం పార్లమెంట్ సమావేశాలకు పిలుపునిచ్చింది. ఈ సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక, కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఎనిమిది రోజులపాటు ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకూ ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు వెల్లడించాయి. ఇందులో భాగంగా జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. జూన్ 24, 25 తేదీల్లో కొత్త పార్లమెంట్ సభ్యులు ప్రమాణం స్వీకారం చేస్తారని సదరు వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్‌ను కమ్మేసిన మేఘాలు.. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం

హైదరాబాద్, జూన్ 11 : హైదరాబాద్ నగరాన్ని మేఘాలు కమ్మేశాయి. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. రాబోయే రెండు గంటల పాటు అంటే 9 గంటల వరకు నగర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాప్రా, దమ్మాయిగూడ, ఈసీఐఎల్, నేరెడ్‌మెట్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కొంపల్లి, జీడిమెట్ల, దుండిగల్, జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, నిజాంపేట్, మియాపూర్, బేగంపేట్, ముషీరాబాద్, ఓయూ, తార్నాక, సరూర్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వాన దంచికొడుతోంది.

భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాహనదారులు అలర్ట్‌గా ఉండాలని హెచ్చరించారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచే అవకాశం ఉంది. కాబట్టి వాహనదారులు నెమ్మదిగా రాకపోకలు కొనసాగించాలని సూచించారు.

## శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భారీగా నకిలీ నోట్ల పట్టివేత

హైదరాబాద్, జూన్ 11 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి తొండుపల్లి సమీపంలో భారీ ఎత్తున నకిలీ నోట్లను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తొండుపల్లి సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి శంషాబాద్ వైపుకు వెళ్తున్న ఓ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో తరలిస్తున్న మూడు లక్షల రూపాయల నకిలీ కరెన్సీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒక్కరే ఉన్నారా మరో ముఠా ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచరం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మ్యాన్‌హోల్స్ తెరిస్తే క్రిమినల్ కేసులు.. జలమండలి హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 10 : గ్రేటర్‌లోనిరహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్‌హోల్స్ తెరిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. వర్షాకాల నేపథ్యంలో జలమండలికి సమాచారం లేకుండా ఎవ్వరూ మ్యాన్‌హోల్ తెరవొద్దని సూచించారు.

ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు, అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరిచిన, తొలగించిన జలమండలి యాక్ట్-1989 సెక్షన్ 74 ప్రకారం నేరమని, దీనిని అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులతో పాటు నిందితులకు జరిమానా విధించడంతో పాటు కొన్ని సార్లు జైలు శిక్ష కూడా వేసే అవకాశముందని ఎండీ చెప్పారు. వర్షాకాల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని ఎండీ వెల్లడించారు.

లోతైన మ్యాన్‌హోళ్లతో పాటు 25వేలకు పైగా మ్యాన్‌హోళ్లపై ఇప్పటికే సేఫ్టీగ్రిల్స్ బిగించామని, ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి రెడ్ పెయింట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందజేశామని ఎండీ వివరించారు.

## ప్రియాంక వారణాసిలో పోటీ చేస్తే మోదీ ఓడిపోయేవారు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 11 :రాయ్‌బరేలి, అమేథిలో తమ విజయానికి అలుపెరగకుండా శ్రమించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. రాయ్‌బరేలిలో మంగళవారం జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అయోధ్యలో బీజేపీ ఓటమి పాలైందని, అయోధ్యే కాదు వారణాసిలో ప్రియాంక గాంధీ పోటీ చేసి ఉంటే ప్రధాని మోదీకి పరాజయం తప్పేదికాదని అన్నారు. ఈసారి అమేథి, రాయ్‌బరేలి, యూపీ సహా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా ఎన్డీయేపై పోరాడిందని అన్నారు. ఎస్పీ నేతలు, శ్రేణులు కాంగ్రెస్‌తో కలిసి ఐక్యంగా ఎన్నికల్లో పోరాడటంతో మెరుగైన ఫలితాలు రాబట్టగలిగామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాయ్‌బరేలి ప్రజలు రాహుల్ గాంధీ తమ ఎంపీగా కొనసాగాలని కోరుకుంటున్నారని, వ్యక్తిగతంగా తాను కూడా రాహుల్ రాయ్‌బరేలి నుంచే పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని అంతకుముందు అమేథి కాంగ్రెస్ ఎంపీ కిషోరీ లాల్ శర్మ పేర్కొన్నారు.

## టిజి ఎడ్ సెట్ 2024 ఫలితాలు విడుదల

హైదరాబాద్ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): బిఈడి కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించిన టిజి ఎడ్ సెట్ 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్. లింబాద్రి, మహాత్మాగాంధీ వర్శిటీ ఇంఛార్జ్ విసి. నవీన్ మిట్టల్ కలిసి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎడ్ సెట్ పరీక్షల్లో 96.90 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని టిజి కాలేజ్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ హాల్ లో ఎడ్ సెట్ ఫలితాలు విడుదల చేశారు.

### నేటి కందం- నేటికీ అందం

"పిల్లలు చేసెడి చాకిరి
నొల్లని దివసము"గ ప్రధిత ఉద్వేగముతో
చల్లగ ప్రకటన జేసిరి
ఫుల్లమ్మగు నీ దినంబు పూతము గాగన్

(జూన్ 12 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం)



-రాధశ్రీ
సెల్:9494481210


## ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ద్వానా సాహితీ కుటీరం
సంయుక్త ఆధ్వర్యంలో



సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి గారి
77వ జయంతి సందర్భంగా



ప్రముఖ రచయిత, సంపాదకులు
శ్రీ జి. వల్లీశ్వర్ గారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక
పురస్కారం-బహూకరణ
శనివారం 15-06-2024, సా॥ 6 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం,
మొదటి అంతస్తు, హైదరాబాదు

ముఖ్యఅతిథి : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ
అధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి, ప్రముఖ కవి, విమర్శకులు
విశిష్ట అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, నేటినిజం సంపాదకులు
ఆత్మీయ అతిథులు : హాస్యబ్రహ్మ శ్రీ శంకర నారాయణ, ప్రముఖ రచయిత
శ్రీ ద్వాదశి శశికాంత్, ద్వానా శాస్త్రి కుమారుడు

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి)
అధ్యక్షులు

మద్దాళి రఘురామ్
కార్యదర్శి

# బాల కార్మిక వ్యవస్థ దురాచారం అమానవీయం..!

## (12 జూన్ 'ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం' సందర్భంగా)

వాతావరణ ప్రతికూల విపత్తులు, కరోనా కల్లోలాల ఫలితంగా బాల కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 217 మిలియన్ల బాల కార్మికులు (ప్రతి 10 మందిలో ఒకరు) ఉన్నారని గమనించాలి. బాల కార్మిక వ్యవస్థ ముఖ్య దుష్ఫలితాల్లో బాలికల లైంగిక వేదింపులు, చర్మ/ఊపిరితిత్తుల/దృష్టి సంబంధ వ్యాధులు, విద్యకు దూరం కావడం, శరీరక మానసిక ఎదుగుదల మందగించడం, అసంఘటిత కార్మికుడిగా బతుకు భారం కావడం లాంటివి వస్తాయి. 5 - 14 లోపు వయస్సు కలిగిన బాలల్ని పనిలో వినియోగించడం చట్టపరంగా నేరంగా చూడబడుతుంది. కౌమారదశలో 14 - 18 ఏండ్ల లోపు యువతను పరిమిత గంటలు సురక్షిత పనులకు మాత్రమే వినియోగించవచ్చని, ప్రమాదకర వాతావరణం మరియు రసాయనాలు లాంటి పరిశ్రమల్లో పనికి వినియోగించవద్దని చట్టం చేరబడింది.

### విపత్తుల విజృంభన:

విపత్తుల విజృంభనతో పేదలందరూ నిరుపేదలుగా, ఉద్యోగులు నిరుద్యోగులుగా మారడం చూస్తుండగానే జరిగి పోయింది. ఆర్థిక అభద్రత, కుటుంబ ఆదాయం తగ్గడం, సాంఘిక భద్రత కొరవడడం, పాఠశాలలు లేకపోవడం లాంటి కారణాలతో పేద కుటుంబాల పిల్లలు కార్మికులుగా అవతారమెత్తడం మినహ మరో మార్గం లేకుండా పోయింది. లాక్‌డౌన్‌లు పేదల పాలిట అశనిపాతంగా మారిన విషయం మరిచి పోలేదు. పని లేకపోవడంతో ఆకలి చావులకు ఆస్కారం ఏర్పడింది. విద్యాలయాల మూసివేతతో కనీసం మద్యాహ్న భోజన వసతులకు కూడా దూరం కావడం జరిగి పోయింది.

### బాల కార్మిక వ్యవస్థ:

బాలల హక్కులను, స్వేచ్ఛను హరించే బాల కార్మిక వ్యవస్థ అనే దురాచారాన్ని రూపుమాపడానికి 2002 నుంచి ఐరాస, యూనిసెఫ్, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తంగా ప్రతి ఏట 12 జూన్ రోజున 'ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. ఐరాస తీర్మాణం ప్రకారం 2021 ఏడాదిని 'అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సంవత్సరం'గా కూడా జరుపుకోవడం చూసాం. ఐరాస రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను అంతం చేయాలని సంకల్పించి తగు కార్యాచరణను అమలు పరుస్తున్నారు. ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లోనే 90 శాతం బాల కార్మికులు ఉన్నారని అర్థం అవుతున్నది. ఆఫ్రికాలో 72 మిలియన్లు (20 శాతం), ఆసియా-పసిఫిక్‌లో 62 మిలియన్లు (7 శాతం), అమెరికాలో 11 మిలియన్లు (5 శాతం), యూరప్-సెంట్రల్ ఆసియాలో 1 మిలియన్ (4 శాతం) మరియు అరబ్ ప్రాంతంలో 3 శాతం బాల కార్మికులు ఉన్నారని అంచన. సహజంగానే పేద ఆర్థికంగా వెనకబడిన దేశాల్లో చిన్నారి చేతులకు కార్మిక సంకెళ్ళు పడుతున్నాయి. పేద, మధ్య ఆదాయ దేశాల్లో 9 శాతం, ఉన్నత మధ్య తరగతి-ధనిక దేశాల్లో 7 శాతం బాల కార్మికులు ఉన్నారు. 5-17 ఏండ్ల లోపు వయస్సు ఉన్న 73 మిలియన్ల బాలలు ప్రమాదకర విషవలయంలో మగ్గుతున్నారు. బాల కార్మికుల్లో 5-11 ఏండ్ల వారు 48 శాతం, 12-14 ఏండ్ల వారు 28 శాతం, 15-17 లోపు వారు 24 శాతం ఉన్నారు. బాల కార్మికులు ముఖ్యంగా 71 శాతం వ్యవసాయం, వ్యవసాయానుబంధ రంగాల్లోనే పని చేస్తున్నారని, 17 శాతం సేవారంగంలో, 12 శాతం పారిశ్రామికరంగంలో గడుపుతున్నారని తేలింది. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం-2024 నినాదంగా "బాల కార్మిక వ్యవస్థను అంతం చేయడానికి అంకితభావంతో పని చేద్దాం" అనే అంశాన్ని తీసుకున్నారు.

### చిన్నారులతో అమానవీయ పనులు:

విపత్తులతో నిరుపేద కుటుంబాలకు చెందిన అభాగ్య బాలలు అక్రమ రవాణ అమ్మాయిలు, బలవంతపు కార్మిక సంకెళ్ళు, పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకొని లొంగదీసుకోవడం లాంటి అనాచారాలకు లోనయ్యారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం వేదికగా వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించ తలపెట్టారు. ఇటుక బట్టీలు, మట్టి తట్టలు, బాణసంచా తయారీలు, వ్యవసాయ కూలీలు, గృహ సంబంధ పనులు, వెట్టి చాకిరీలు, శ్రమ దోపిడి, అమానవీయ చర్యలు, వలసలు, గృహ వసతి లేమి లాంటి ప్రమాదకర పనుల్లో చిన్నారుల బతుకులు చితికి పోవడం అమానవీయం.

ఇలాంటి అంశాలను గమనిస్తూ ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, కార్మిక సంఘాలు, పౌర సమాజం అంకితభావం, సమన్వయాలతో నడుంబిగించి బాలలకు వేసిన కార్మిక సంకెళ్ళను నిర్దయగా తొలగించే ముమ్మర ప్రయత్నాలు చేయాలి. బాలల్ని శారీరక, మానసిక, సాంఘిక, మానవీయ కోణంలో ఎదిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలి. నేటి బాలలైన రేపటి పౌరులకు స్వేచ్ఛ, హక్కులను కల్పిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# పలువురుని పరామర్శించి ఆర్థికసాయం అందించిన పరికపల్లి

## - ప్రజాసేవలో ముందుంటా...

ఖమ్మం, జూన్ 11 :(నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం




పెద్ద మునగాల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బైరం కాంతారావు, లింగాల జీవమ్మ, బైరం నాగమ్మ, మధు లను పరామర్శించి ఆధైర్యపడవద్దని అండగా ఉంటామని హామినిచ్చి నాకు పదవి ఉన్న లేకున్నా ప్రజల్లోనే ఉంటానని మీ కష్ట సుఖాలలో పాలు పంచుకుంటానని ప్రజాసేవ చేయడం నాకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరం బాలరాజు, తలారి చిన్న గురవయ్య, తలారి చందు, గోపయ్య, యేసొబు, కోటయ్య, రత్తయ్య, నరేష్, మధు, అశోక్, తదితరులున్నారు.

# కాకినాడలోని ఈఎస్ఐసీ హాస్పిటల్‌లో రిక్రూట్‌మెంట్‌లో అవినీతి జరిగిందన్న ఆరోపణలను ఖండించారు

న్యూఢిల్లీ, జూన్ 11 :ఈఎస్ఐ కాకినాడ ఆస్పత్రిలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీలో అవినీతి జరిగిందని ఇటీవల స్థానిక న్యూస్ ఛానల్స్ మరియు స్థానిక ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమైన వార్తా కథనానికి సంబందించి, ఈఎస్ఐసీలో పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన రిక్రూట్‌మెంట్లు జరుగుతున్నాయని స్పష్టం చేయడమైనది.

కాకినాడలోని ఇఎస్ఐసి హాస్పిటల్‌లో తాత్కాలిక ఉద్యోగస్తులను (స్కిల్డ్/సెమి స్కిల్డ్/అన్‌స్కిల్డ్) కేంద్ర ప్రభుత్వం యొక్క ఉవఓ పోర్టల్ ద్వారా తగిన విధానాన్ని అనుసరించి అర్హత కలిగిన ఏజెన్సీని పారదర్శకంగా ఎంపిక చేసి, తద్వారా, తాత్కాలిక ఉద్యోగస్తుల పోస్టులను భర్తీ చెయ్యడం జరిగింది.

ఈ ఎంపిక ప్రక్రియలో బయటి వారి ప్రభావం లేదా పాత్ర ఏమీ లేదని మరియు కాకినాడలోని ఇఎస్ఐసి హాస్పిటల్‌లో రిక్రూట్‌మెంట్‌లో అవినీతి ఆరోపణలు నిజం కావని తెలియజేస్తూ, ఈ ఆరోపణలు కేవలం వారి స్వార్థ ప్రయోజనాల కోసం మాత్రమే చేసినట్లు అనిపిస్తుందని స్పష్టం చేయబడింది. ఇఎస్ఐసి, ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ, అర్హత కలిగిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని ఎంపిక చేయబడ్డ ప్రక్రియలో అన్ని నియమాలు/విధానాలను పాటించేందుకు తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

# ఒమన్ యొక్క సుల్తాన్ నుండి టెలిఫోన్ మాధ్యం ద్వారా అభినందనల ను స్వీకరించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 11 :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో ఒమన్ యొక్క సుల్ తాన్ శ్రీ హైథమ్ బిన్ తారిక్ టెలిఫోన్ ద్వారా ఈ రోజు న సంభాషించారు.

ఇటీవలె జరిగిన సాధారణ ఎన్నికలు ముగిసిన దరిమిలా ప్రధాన మంత్రి మూడో పదవీకాలానికి గాను తిరిగి నియామకం కావడం పట్ల సుల్ తాన్ శ్రీ హైథమ్ బిన్ తారిక్ తన హృదయపూర్వక అభినందనల ను వ్యక్తం చేశారు.

ఒమన్ కు మరియు భారతదేశాని కి మధ్య శతాబ్దాల నాటి నుండి ఉన్న మిత్రత్వాన్ని సుల్‌తాన్ గారు నొక్కిపలుకుతూ భారతదేశం యొక్క ప్రజల ప్రగతి పథం లో మరియు సమృద్ధి బాట లో సాగిపోవాలంటూ తన శుభాకాంక్షల ను తెలియజేశారు.

సుల్ తాన్ గారు హార్దిక శుభాకాంక్షల ను తెలియజేసినందుకు ప్రధాన మంత్రి ధన్యవాదాల ను తెలిపారు. సుల్ తాన్ గారు 2023 వ సంవత్సరం డిసెంబరు లో భారతదేశాని కి విచ్చేసిన చారిత్రిక సందర్భం లో అన్ని రంగాల లోను ద్వైపాక్షిక సహకారం విస్తృతం కావడం తో పాటు బలోపేతం కావడాని కి ఆ పర్యటన దారి తీసిందన్న సంగతి ని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావించారు.

భారతదేశం-ఒమన్ భాగస్వామ్యాన్ని ఉభయ దేశాల కు పరస్పర ప్రయోజనకరం గా మరింతగా పటిష్టపరచడానికి కట్టుబడి ఉందాం అంటూ ఇద్దరు నేతలు వారి యొక్క వచనబద్ధత ను పునరుద్ఘాటించారు.

త్వరలో రానున్న ఈద్ అల్ అద్ హా పర్వదినాన్ని దృష్టి లో పెట్టుకొని ఒమన్ ప్రజల కు మరియు సుల్ తాన్ గారి కి హృదయపూర్వక శుభాకాంక్షల ను ప్రధాన మంత్రి వ్యక్తం చేశారు.

# సమాచార మరియు ప్రసార శాఖ సహాయ మంత్రి యొక్క పదవీబాధ్యతలను స్వీకరించిన శ్రీ లోగనాథన్ మురుగన్



న్యూఢిల్లీ, జూన్ 11 :సమాచార మరియు ప్రసార శాఖ సహాయ మంత్రి గా డాక్టర్ శ్రీ ఎల్. మురుగన్ ఈ రోజు న పదవీ బాధ్యతల ను చేపట్టారు. ఈ సందర్భం లో ప్రసార మాధ్యమాల ప్రతినిధుల తో డాక్టర్ శ్రీ మురుగన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తనను నమ్మి ఈ బాధ్యతను తన అధీనం లో ఉంచినందుకు కృతజ్ఞత ను వ్యక్తం చేశారు. ప్రభుత్వాని కి మరియు దేశ ప్రజల కు మధ్య ఒక సమాచార సేతువు గా వ్యవహరించడం ద్వారా సమాచారం మరియు ప్రసారం మంత్రిత్వ శాఖ ప్రభుత్వ విధానాల ను అమలు పరచడం లో ఒక కీలక పాత్ర ను పోషిస్తుందని కూడా మంత్రి అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కంకణం కట్టుకొంది, పట్టణ ప్రాంతాల లో మరియు గ్రామీణ ప్రాంతాల లో మూడు కోట్ల ఇళ్ళ ను 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' లో భాగం గా నిర్మించాలని మంత్రివర్గం తీసుకొన్న నిర్ణయం దీనికి ఒక దృష్టాంతం గా నిలచింది అని డాక్టర్ శ్రీ మురుగన్ అన్నారు. డాక్టర్ శ్రీ మురుగన్ కు మంత్రిత్వ శాఖ యొక్క కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, ఇతర సీనియర్ అధికారులు మరియు మంత్రిత్వ శాఖ లో భాగం గా ఉన్న ప్రసార మాధ్యమాల విభాగాల ప్రతినిధులు స్వాగతం పలికారు.

# ప్రభుత్వ ఏర్పాటునకు చంద్రబాబును ఆహ్వానించండి - గవర్నర్ తో కూటమి నేతలు



అమరావతి, జూన్ 11 :ఎపిలో కొత్త ప్రభుత్వం ఏర్పాటునకు ఎన్డీఎ కూటమి నేత చంద్రబాబు ను ఆహ్వానించాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ను కూటమి నేతలు కోరారు. నేడు రాజ్ భవన్ లో గవర్నర్ ను నేడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ కలిశారు.

ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల తరఫున సభానాయకుడిగా టీడీపీ అధినేత, కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నట్లు ఆయనకు వివరించారు.. ఈ మేరకు గవర్నర్ కు 164 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను సమర్పించారు. అనంతరం రాజ్ భవన్ వెలుపల అచ్చెన్నాయుడు, పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. తాము చేసిన విజ్ఞప్తికి గవర్నర్ సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి చెప్పారు. చట్ట నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తానని గవర్నర్ తమకు తెలియజేశారన్నారు.

# ఎపిలో 13 నుంచి విద్యా కానుకలు పంపిణి

అమరావతి, జూన్ 11 :ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. యధావిధిగా విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని అలాగే కొనసాగించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుకను? జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన తరహాలోనే ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది కొత్త ప్రభుత్వం. ప్రభుత్వం మారినందున విద్య కానుకను ఏం చేస్తారనే సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది చంద్రబాబు ప్రభుత్వం.

బడి గంట మోగిన తొలి రోజునే విద్యార్థులకు విద్యా కానుకలు ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు.. ఈనెల 13వ తేదీన బడులు తెచ్చుకునే రోజు నుంచి పంపిణీ మొదలు పెట్టనుంది. 2024 సంవత్సరం నుంచి 2025 విద్యా సంవత్సరంలో పంపిణీ కిట్లను ఇప్పటికే సిద్ధం చేసింది ప్రభుత్వం.

# చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చిరంజీవికి ఆహ్వానం ..

అమరావతి, జూన్ 11 :ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి 164 ఎమ్మెల్యే సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది.

రేపు ఉదయం 11 గంటల 27 నిమిషాలకు చంద్రబాబు ప్రమాణస్వీకారం జరగనుంది.

ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సినీ రాజకీయ పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరవనున్నారు.

ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చిరంజీవికి ఆహ్వానం అందింది. స్టేట్ గెస్ట్‌గా చిరంజీవికి స్వయంగా చంద్రబాబు ఈ ఆహ్వానం పంపారు. అయన ఆహ్వానం మేరకు చిరంజీవి ఈరోజు సాయంత్రం ఐదు గంటలకు విజయవాడకు తన కుటుంబ సభ్యులతో కలసి వెళ్లనున్నారు..

# ఎయర్ ఫోర్స్అకాడమి (ఎఎఫ్ఎ), దుండిగల్ లో 2024 జూన్ 15 వ తేదీ నాడు కంబైన్డ్ గ్రాజుయేశన్ పరేడ్ (సిజిపి) ని సమీక్షించనున్న చీఫ్ ఆఫ్ ఎయర్ స్టాఫ్

న్యూఢిల్లీ, జూన్ 11 :భారతీయ వాయు సేన (ఐఎఎఫ్) లోని ఫ్లయింగ్ ఎండ్ గ్రౌండ్ డ్యూటీ విభాగాల కు చెందిన ఫ్లైట్ కేడెట్స్ యొక్క ప్రి-కమిశనింగ్ ట్రైనింగ్ శిక్షణ విజయవంతం గా సమాప్తం అయిందని సూచించడం కోసం హైదరాబాద్ లోని దుండిగల్ లో గల ఇండియన్ ఎయర్ ఫోర్స్ అకాడమి (ఎఎఫ్ఎ) లో 213 మంది అధికారుల పాఠ్యక్రమం తాలూకు కంబైన్డ్ గ్రాజుయేశన్ పరేడ్ (సిజిపి) ని 2014 జూన్ 15 వ తేదీ నాడు సాంప్రదాయక సైన్య భవ్యత యుక్తం గా నిర్వహించడం జరుగుతుంది. ఈ పరేడ్ కు సమీక్ష అధికారి (ఆర్ఒ) గా వాయు సేన ప్రధాన అధికారి (చీఫ్ ఆఫ్ ఎయర్ స్టాఫ్- సిఎఎస్) ఎయర్ చీఫ్ మార్శల్ శ్రీ వి.ఆర్, చౌధరి ఉంటారు.

ఈ కార్యక్రమం లో సమీక్ష అధికారి (ఆర్ఒ) స్నాతక శిక్షణార్థుల కు రాష్ట్రపతి యొక్క కమిశన్ ను ప్రదానం చేయనున్నారు. ఇదే కార్యక్రమం లో విమానాన్ని నడపడం లో శిక్షణ ను సఫలతపూర్వకంగా ముగించిన ఫ్లైట్ కేడెట్స్ కు, భారతీయ నౌకాదళం, భారతీయ కోస్తా తీర రక్షక దళం ల అధికారుల కు మరియు మిత్ర దేశాల యొక్క అధికారుల కు 'వింగ్స్' ను ప్రదానం చేయడం భాగం గా ఉంటుంది. శిక్షణ తాలూకు ఒక కఠోరమైన గడువు ను ముగించిన ందుకు ప్రతీక గా ఉండేటటువంటి ఈ సందర్భం వైమానిక దళం లో ఉద్యోగాన్ని ఆశించిన అభ్యర్థుల యొక్క వృత్తి జీవితం లో అత్యంత ప్రధానంపైన మైలురాయి వంటిది గా ఉంటుంది. ఫ్లయింగ్ విభాగం లో ప్రతిభ క్రమం వారి గా ఒకటో స్థానం సంపాదించిన ఫ్లయింగ్ కేడెట్ కు మొత్తం మీద శిక్షణ లో ప్రావీణ్యాన్ని కనబరచినందుకు గాను చీఫ్ ఆఫ్ ద ఎయర్ స్టాఫ్ యొక్క 'స్వార్డ్ ఆఫ్ ఆనర్' ను మరియు రాష్ట్రపతి ఫలకాన్ని అందజేయడం జరుగుతుంది. అదే ఫ్లయిట్ కేడెట్ కు, పరేడ్ కు నాయకత్వాన్ని వహించే విశేష అధికారం కూడా దక్కుతుంది. గ్రౌండ్ డ్యూటీ విభాగాల లో మొత్తం మీద ప్రతిభ క్రమం వారి గా ప్రథమ స్థానం లో నిలచే శిక్షణార్థి కి రాష్ట్రపతి ప్రశంస ఫలకాన్ని కూడా సమీక్ష అధికారి (ఆర్ఒ) ప్రదానం చేస్తారు. పిలాటస్ పిసి -7 ఎమ్‌కె-శ్రీఎ, డోర్నియర్, హాక్, కిరణ్ మరియు చేతక్ విమానాల శ్రేణుల ద్వారా ఉత్తేజ భరితమైన ఫ్లయ్ ఫాస్ట్, మరి అలాగే పిలాటస్ పిసి -7 ఎమ్‌కె-శ్రీఎ, ఎస్‌యు-30 ఎమ్ కెఐ, సూర్య కిరణ్ ఎరోబాటిక్ టీమ్ (ఎస్‌కెఎటి), ఇంకా సారంగ్ హెలికాప్టర్ డిస్ ప్లే టీమ్ ద్వారా ఎరోబాటిక్ శో కంబైన్డ్ గ్రేజుయేశన్ పరేడ్ (సిజిపి) విన్యాసాల తో పరేడ్ ముగింపు దశ కు చేరుకొంటుంది.

భారత వాయు సేన (ఐఎఎఫ్) లో ప్రముఖ శిక్షణ విభాగం అయిన ఎఎఫ్ఎ భారతీయ వాయు సేన యొక్క విమాన చోదకుల, గ్రౌండ్ డ్యూటీ మరియు సాంకేతిక అధికారుల కు శిక్షణ ను ఇస్తున్నది. ఈ అకాడమి 1967 వ సంవత్సరం అక్టోబరు 11 వ తేదీ నాడు అప్పటి భారతదేశం యొక్క రాష్ట్రపతి డాక్టర్ శ్రీ జాకిర్ హుసైన్ శంకు స్థాపన చేయడం తో లాంఛనం గా ఉనికి లోకి వచ్చింది. సౌహార్ద భావన ను పెంపొందింపచేయడం మరియు ప్రతి శాఖ కు చెందిన అధికారుల మధ్య ఆరోగ్యకరమైన మాటామంతీ ని ప్రోత్సహించడం అనేవి ఈ అకాడమి లో శిక్షణ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు గా ఉన్నాయి.

# నీట్ పరీక్ష రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ- ఎన్ టీఏకు నోటీసులు

న్యూఢిల్లీ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ()): వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎంట్రెన్స్ కమ్ ఎలిజిబిలిటీ టెస్ట్ అండర్ గ్రాడ్యయేట (నీట్ యూజి) పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ పై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమానుల్లాహ్ తో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. మే 5న జరిగిన నీట్ యూజి పరీక్ష పేపర్ లీకేజ్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాలని పిటిషనర్లు కోరుతున్నారని, దీనిపై సమాధానం చెప్పాలంటూ కేంద్ర ప్రభుత్వానికి, ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ టీఏ)కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా నీట్ పరీక్షను రద్దు చేయడం అంత సులభం కాదని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది." ఆరోపణలపై మాకు సమాధానాలు కావాల. ఎప్పటి లోగా సమాధానం చెబుతారు? కాలేజీలు తెరుచుకున్న వెంటనే చెబుతారా?? లేకుంటే ఎంబిబిఎస్ కౌన్సలింగ్ మొదలవుతుంది" అని ఎన్ టీఏ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి న్యాయమూర్తి అమానుల్లాహ్ అన్నారు. స్పందన తెలుపాలంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి నోటీసలు జారీ చేశారు.


వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో....

జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు - 2024

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలు :
- కథ చేతిరాతలో 5 పేజీలకు మించరాదు. డి.టి.పి. చేసినచో 3 పేజీలకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

నిబంధనలు :

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలు :
- కవిత 25 లైన్లకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కథలు, కవితలు పోటీలు నిర్వహించనున్నారు.

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 5000/-, ద్వితీయ బహుమతి రూ. 4000/-, తృతీయ బహుమతి రూ. 3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 4000/-, ద్వితీయ బహుమతి రూ. 3000/-, తృతీయ బహుమతి రూ. 2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి "భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ" గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10,000/- నగదు బహుమతి అందజేయబడుతుంది.

కవితలు, కథలు పంపాల్సిన చివరి తేది : 30 జూన్ 2024

కథలు, కవితలు పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001. సెల్ : 98492 77968

పూర్తి వివరాలకు : వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు : వురిమళ్ల సునంద, సెల్ : 9441815722

# కేంద్ర సమాచార మరియు ప్రసార శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన శ్రీ అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ, జూన్ 11 :కేంద్ర సమాచారం మరియు ప్రసారం శాఖ మంత్రి గా శ్రీ అశ్వినీ వైష్ణవ్ పదవీ బాధ్యతల ను ఈ రోజు న ఇక్కడ స్వీకరించారు. ఈ సందర్భం లో ప్రసార మాధ్యమాల ప్రతినిధుల తో శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కి అంకితం అయిందన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల లో మూడు కోట్ల ఇళ్ళ ను నిర్మించాలని మంత్రివర్గం నిన్నటి రోజు న తీసుకొన్న నిర్ణయాన్ని మంత్రి పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తొలి రోజు న తీసుకొన్నటువంటి ఒకటో మంత్రివర్గ నిర్ణయం పేదల సశక్తీకరణ కు సమర్పణమైందని ఆయన అన్నారు. దేశం లోని ప్రజల కు ప్రభుత్వం నిరంతరం సేవ చేస్తూ ఉంటుందని కూడా ఆయన తెలిపారు

సమాచారం మరియు ప్రసారం శాఖ మంత్రి గా సేవల ను అందించే అవకాశాన్ని తనకు ఇచ్చినందుకు గాను ప్రధాన మంత్రి కి మంత్రి తన కృతజ్ఞత ను వ్యక్తం చేశారు.

శ్రీ అశ్వినీ వైష్ణవ్ కు మంత్రిత్వ శాఖ యొక్క కార్యదర్శి శ్రీ సంజయ్ జాజూ తో పాటు ఇతర సీనియర్ అధికారులు మరియు మంత్రిత్వ శాఖ లో భాగం గా ఉన్న ప్రసార మాధ్యమాల విభాగాలు స్వాగతం పలికాయి.

# సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సీఎం ఆలోచనను స్వాగతిస్తున్నాం

సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సీఎం ఆలోచనను స్వాగతిస్తున్నాం

**-నాగర్ కర్నూల్ ఎంపీ,టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి**




హైదరాబాద్ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాష్ట్రంలో సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సీఎం ఆలోచనను స్వాగతిస్తున్నామని,ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్ళలో సరైన సౌకర్యాలు లేవని నాగర్ కర్నూల్ ఎంపీ,టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి అన్నారు.మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో టిపిసిసి అధికార ప్రతి నిధీ భావాన్ని రెడ్డి తో కలిసి మాట్లాడారు.సెమీ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది...టీచర్లు లేరనీ గత ప్రభుత్వం పాఠశాలలను మూసేసిందిమూసేసిన పాఠశాలలను మళ్ళీ తెరుస్తాం ఏకోపాధ్యాయ స్కూళ్లను రద్దు చేయరని సీఎం హామి ఇచ్చారు2 వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం ప్రతి పాఠశాలలో టాయిలెట్లు ,న్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తాంఅన్ని సౌకర్యాలను కల్పించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచుతాంబయ్యారం స్టీల్ ప్లాంట్, ఖాజీ పేట కోచ్ ఫ్యాక్టరీ, రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా సమస్యల మీద పార్లమెంట్ లో కొట్లాడతాంవిభజన సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ లో కేంద్రాన్ని ప్రశ్నిస్తాం బడి బాట కార్యక్రమంలో ప్రజా ప్రతినిదులు పాల్గొనాలని సీఎం రేవంత్ సూచించారు

# ఇంగ్లంగ్‌లో పల్నాడు జిల్లా యువకుడు మృతి..

అమరావతి, జూన్ 11 :ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్ వెళ్లిన ఆంధ్రా యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ యువకుడిని పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరుకు చెందిన సాయిరాం (24)గా గుర్తించారు.

కాగా, పల్నాడు పోలీసుల వివరాల ప్రకారం? సాయిరామ్ ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్ వెళ్లాడు. అయితే ఈ నెల 2వ తేదీన మాంచెస్టర్ బీచ్ వద్ద ఇంగ్లిష్ పోలీసులు సాయిరాం మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే మాంచెస్టర్ పోలీసులు పల్నాడు జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# మళ్లీ ఉల్లి ధరలకు రెక్కలు : రెండు వారాలుగా 50 శాతం భారం



హైదరాబాద్, జూన్ 11 : సరఫరాలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు వారాలుగా ఉల్లి ధరలు ఎగబాకుతున్నాయి. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాలు లేకపోవడంతో ఉల్లి ధరలు ఇటీవల ఏకంగా 50 శాతం పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అతిపెద్ద ఉల్లి మార్కెట్ నాసిక్‌లో సోమవారం కిలో ఉల్లి ధర రూ. 17 నుంచి రూ.26కు పెరిగింది. నాణ్యతతో కూడిన ఉల్లి ధర కిలో దేశవ్యాప్తంగా పలు హోల్‌సేల్ మార్కెట్లలో రూ. 30 పలుకుతోంది. 2023-24 రబీ దిగుబడులు తగ్గాయనే అంచనాతో ధరలు పెరిగే అవకాశం ఉంటుందనే యోచనతో రైతులు ఉల్లి నిల్వలను బయటకుతీయకపోవడం కూడా సరఫరాలపై ప్రభావం చూపుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

మహారాష్ట్ర ఉల్లికి దక్షిణాది రాష్ట్రాల నుంచి భారీ డిమాండ్ ఉందని నాసిక్‌కు చెందిన ఉల్లి వ్యాపారి వికాస్ సింగ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సుంకాన్ని తొలగిస్తుందని రైతులు, స్టాకిస్ట్‌లు ఆశాభావంతో ఉన్నారని, ధరలు పెరుగుతాయనే అంచనాతో రైతులు, వ్యాపారులు ఉల్లిని పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారని, అందుకే ఉల్లి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయని సింగ్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతుండగా వినియోగదారులు మాత్రం ఉల్లి ధరలను తలుచుకుని కలవరపడుతున్నారు.

# కూటమి శాసనసభ పక్ష సమావేశంలో అరుదైన ఘటన

**-నాడు దగ్గుపాటి...నేడు దగ్గుపాటి**

అమరావతి జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కూటమి శాసనసభ పక్ష సమావేశంలో అరుదైన ఘటన చోటు చేసుకుంది. 1995లో తొలిసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయంలో తెలుగుదేశం శాసనసభ పక్ష సమావేశంలో తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేరును దగ్గుబాటి వెంకటేశ్వర రావు ప్రతిపాదించారు. 29 ఏళ్ల తర్వాత జరిగిన కూటమి శాసనసభ పక్ష సమావేశం లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేరును దగ్గుబాటి వెంకటేశ్వరరావు సతీమణి, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి బలపరిచారు. 95 నాటి పరిణామాలను మరోసారి టీడీపీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు.

# కూర్చొని పవర్ ఎంజాయ్ చేద్దామంటే కుదరదు

**-ఎమ్మెల్యేలకు దిశానిర్దేశనం చేసిన జనసేన పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్**

అమరావతి జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జనసేన శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పాత తరం రాజకీయాలు పోయాయని, కూర్చొని పవర్ ఎంజాయ్ చేద్దామంటే కుదరదని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశనం చేశారు. "ప్రజలు మనకు ఎంత మద్దతిచ్చారో.. వారికి కోపం వస్తే అంతే బలంగా నిలదీయగలరు" అని అన్నారు. ప్రజలు ఏదైనా సందర్భంలో అసహనంతో ఓ మాట మాట్లాడినా భరించాలని, ఇది తప్పదని అన్నారు.

**ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయొద్దు..**

ఐదేళ్ల కాలాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ సూచించారు. ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయొద్దని హెచ్చరించారు. తాను ఎమ్మెల్యేలతో తరుచూ సమావేశమవుతానని, మిత్రపక్షాలతో కలిసి వెళ్తానే.. జనసేనకు గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. "జనం మనల్ని నమ్ముబట్టే ఈ స్థాయి విజయాన్ని మనకు చేకూర్చారు" అని అన్నారు.

**కక్ష సాధింపునకు ఇది సమయం కాదు..**

కక్ష సాధింపునకు ఇది సమయం కాదని పవన్ కల్యాణ్ అన్నారు. "గతంలో అలా చేశారు కాబట్టి.. మనమూ అలాగే చేయాలని అనుకోవద్దు. కక్ష సాధింపును నేను ఎంకరేజ్ చేయను. దేశంలో ఎవ్వరికి లేని రికార్డు 100 శాతం స్ట్రైకింగ్ రేట్ మనకు వచ్చింది. ప్రజలకు మనపై ఎంత విశ్వాసాన్ని ఉంచారో అర్థం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ అన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతే... చంద్రబాబు నాయుడు

అమరావతి జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి అని టిడిపి అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖపట్టణాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్డీయే సభాపక్షనేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పుని ప్రజలు ఇచ్చారని.. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. రాష్ట్రంలో అరాచకానికి, అశాంతికి చోటులేదన్నారు. శిథిలమైన రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టాలన్నారు. కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.పవన్ కల్యాణ్ సమయస్ఫూర్తి ఎప్పటికీ మరిచిపోలేనని చంద్రబాబు చెప్పారు.

తాను జైలులో ఉన్నప్పుడు పవన్ వచ్చి పరామర్శించారని.. అక్కడే టిడిపి, జనసేన పొత్తు పెట్టుకుంటున్నట్లు తెలిపారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బిజెపి, టిడిపి, జనసేన పొత్తు పెట్టుకుందని అన్నారు. కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నదులు అనుసంధానించి ప్రతి ఎకరానికి నీరు అందిస్తాం. ప్రజాస్వామ్యయుతంగా ప్రజాహితం కోసం పనిచేస్తామని చెప్పారు.

# ఏఐఎం-ఐసీడీకే వాటర్ ఛాలెంజ్ 4.0, ఇన్నోవేషన్ ఫర్ యూ- ఎస్ డీజీ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియాను ఆవిష్కరించిన అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, జూన్ 11 :అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ (ఎఐఎం) భారతదేశంలో సృజనాత్మకత మరియు సుస్థిరతను ప్రోత్సహించే లక్ష్యంతో రెండు ముఖ్యమైన కార్యక్రమాలను ప్రారంభించినట్లు ప్రకటించింది: 'ఎఐఎం - ఐసిడికె వాటర్ ఛాలెంజ్ 4.0' మరియు 'ఇన్నోవేషన్స్ ఫర్ యు' హ్యాండ్బుక్ యొక్క ఐదవ ఎడిషన్, భారతదేశంలోని ఎస్డిజి పారిశ్రామికవేత్తలను వెలుగులోకి తెస్తుంది.

భారత్ లోని రాయల్ డానిష్ రాయబార కార్యాలయంలోని ఇన్నోవేషన్ సెంటర్ డెన్మార్క్ (ఐసీడీకే) సహకారంతో ఓపెన్ ఇన్నోవేషన్ వాటర్ ఛాలెంజ్ నాలుగో ఎడిషన్ ను ఏఐఎం అందిస్తోంది. ఇండో-డానిష్ ద్వైపాక్షిక హరిత వ్యూహాత్మక భాగస్వామ్యానికి మూలస్తంభమైన ఈ చొరవ, సృజనాత్మక పరిష్కారాల ద్వారా కీలకమైన నీటి సంబంధిత సవాళ్లను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది. ఎంపికైన బృందాలు గ్లోబల్ నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ యాక్షన్ ప్రోగ్రావెల్లో పాల్గొని 9 దేశాల (ఇండియా, డెన్మార్క్, ఘనా, కెన్యా, కొరియా, టాంజానియా, దక్షిణాఫ్రికా, ఘనా, కొలంబియా, మెక్సికో) ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఇన్నోవేషన్ హబ్ల నుండి యువ ప్రతిభావంతులతో కనెక్ట్ అవుతాయి.

ఎంపిక చేసిన బృందాల నుండి పాల్గొనేవారు (గ్రూప్ వర్క్, బూట్ క్యాంప్ సెషన్లు, కీనోట్లు మరియు వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వంతో కూడిన హైబ్రిడ్ ఇన్నోవేషన్ ప్రయాణంలో నిమగ్నతను ఊహించవచ్చు.

ఈ కార్యక్రమం సుస్థిరత, డిజిటల్ పరిష్కారాలు, చేరిక మరియు సార్వత్రిక రూపకల్పన సూత్రాల అన్వేషణను ప్రోత్సహిస్తుంది. చురుకైన బ, ా గ్ ా వ వ య ం పెంపొందించబడుతుంది, తోటివారి మధ్య సహకార మద్దతు మరియు జ్ఞాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. డెన్మార్క్ ప్రభుత్వ నిధులతో 2024 అక్టోబర్ 30 నుంచి 31 వరకు కోపెన్ హాగన్ లో జరిగే డిజిటల్ టెక్ సమ్మిట్ లో పాల్గొనేవారికి ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశం ఉంటుంది.

ఈ ఛాలెంజ్ రెండు ట్రాక్ ల కింద ఎంట్రీలను ఆహ్వానిస్తుంది: ఒకటి విద్యార్థులకు మరియు మరొకటి 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న యువ పారిశ్రామికవేత్తల కోసం. సానుకూల పర్యావరణ మార్పుకు కట్టుబడి ఉన్న ప్రారంభ దశ స్టార్టప్ లు, పరిశోధకులు మరియు యువ ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకోవడానికి ప్రోత్సహించబడతారు. డిజిటలైజేషన్ పై నిర్దిష్ట దృష్టితో సుస్థిరత సవాళ్ల ద్వారా బాహ్య భాగస్వాములు ముందుకు తీసుకువచ్చిన డిజిటల్ యాక్షన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ పై విద్యార్థి ప్రయాణం దృష్టి పెడుతుంది. యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ట్రాక్ భారతీయ టెక్నాలజీ స్టార్టప్ లకు వారి ఆలోచనలను వేగవంతం చేయడానికి మరియు ప్రపంచ భాగస్వామ్యాలను ఏర్పరచడానికి ప్రారంభ దశలో ఉత్తేజకరమైన అవకాశాన్ని అందిస్తుంది.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా నీతి ఆయోగ్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ మాట్లాడుతూ, "ఎఐఎం - ఐసిడికె వాటర్ ఛాలెంజ్ 4.0 మరియు ఇన్నోవేషన్స్ ఫర్ యు - ఎస్డిజి ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా యొక్క ఐదవ ఎడిషన్ను ప్రారంభించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ చొరవలు సృజనాత్మకత మరియు సుస్థిరత కోసం మా అలుపెరగని అన్వేషణను ప్రతిబింబిస్తాయి, భారతదేశాన్ని ప్రకాశవంతమైన, మరింత స్థితిస్థాపక భవిష్యత్తు వైపు నడిపిస్తాయి. ఎఆఆఐ మరియు భారతదేశంలోని రాయల్ డానిష్ రాయబార కార్యాలయం వంటి భాగస్వాములతో సహకార ప్రయత్నాల ద్వారా, ఒత్తిడితో కూడిన సవాళ్లను పరిష్కరించడం మరియు రెండు దేశాలలో సానుకూల మార్పును నడిపించడానికి యువ ఆవిష్కర్తలను శక్తివంతం చేయడం మా లక్ష్యం. స్టార్టప్ లతో పాటు అభిరుచి గల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నాం.

మినిస్టర్ కౌన్సెలర్, న్యూఢిల్లీలోని ట్రేడ్ కౌన్సిల్ హెడ్ మరియు దక్షిణాసియా రీజనల్ కోఆర్డినేటర్ సోరెన్ నోర్రెలండ్ కన్నిక్-మార్క్వార్డ్సెన్ తన ప్రసంగంలో, "వాటర్ ఛాలెంజ్ భారతదేశం మరియు డెన్మార్క్ మధ్య హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం (జీఎస్పి) లో 5 ఎస్లను కలిగి ఉండటం నాకు సంతోషంగా ఉంది - నైపుణ్యాలు, స్కేల్, పరిధి, సుస్థిరత మరియు వేగం. ఈ ఛాలెంజ్ భారతదేశం మరియు డెన్మార్క్ మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసే ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి డెన్మార్క్ మరియు భారతీయ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను కలపడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భాగస్వామ్యం నాల్గవ సంవత్సరంలో నడుస్తోందని చెప్పడానికి మేము గర్విస్తున్నాము, ఇది మా సహకారం యొక్క విజయాన్ని సూచించడమే కాకుండా ప్రపంచంలోని అత్యంత క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో మరియు మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో యువ ఆవిష్కర్తల అంకితభావాన్ని కూడా సూచిస్తుంది. ఈ రోజు వెబ్ సైట్ ను ప్రారంభించడానికి మేము సంతోషిస్తున్నాము మరియు ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద సమస్యలను పరిష్కరించడానికి యువ ఆవిష్కర్తలను ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి చాలా ప్రోత్సహిస్తున్నాము. ఈ ఛాలెంజ్ యొక్క నాల్గవ ఎడిషన్ విజయవంతం కావాలని మరియు మా భాగసామ్యులందరితో ఈ భాగస్వా మ్యాన్ని కొనసాగించాలని మేము ఆశిస్తున్నాము. ఐసిడికెతో పాటు, ఎఐఎమ్ భారతదేశ ఎస్డిజి ఎంటర్ప్రెన్యూర్స్ ప్రయత్నాలను వెలుగులోకి తెచ్చే కాఫీ టేబుల్ బుక్ సిరీస్ 'ఇన్నోవేషన్స్ ఫర్ యు' యొక్క ఐదవ ఎడిషన్ను కూడా ప్రవేశపెట్టింది. ఈ ఎడిషన్లో భారతదేశంలోని వివిధ మూలల నుండి 60 మంది పారిశ్రామికవేత్తలు ఉన్నారు, ప్రతి ఒక్కరూ స్థిరమైన ఆవిష్కరణల ద్వారా సామాజిక మెరుగుదలకు దోహదపడతారు.

ఈ స్టార్టప్ లు రీసైకిల్ చేయదగిన మరియు పునరుత్పాదక పదార్థాలు, గ్రీన్ ఎనర్జీ, సమ్మిళిత విద్య మరియు తక్కువ ప్రాతినిధ్యం కలిగిన కమ్యూనిటీలు మరియు స్థానిక చేతివృత్తుల పై దృష్టి పెడతాయి.

# కేంద్ర సచివాలయంలో వరుసగా 23వ నెలలో లక్ష దాటిన పరిష్కార కేసులు

న్యూఢిల్లీ, జూన్ 11 : కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల పనితీరును తెలియజేసే కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణ వ్యవస్థ ( సిపిజిఆర్ ఏ ఎం ఎస్)పైన 25వ మాస నివేదికను పరిపాలన సంస్కరణలు మరియు ప్రజాఫిర్యాదుల (డిఏఆర్ పిజి) విభాగం విడుదల చేసింది. ఇది మే, 2024కు సంబంధించిన నివేదిక. ఈ నివేదక ప్రజా ఫిర్యాదులకు సంబంధించి వివరణాత్మక విశ్లేషణను, వాటి కేటగిరీలను అందిస్తోంది. అంతే కాదు ఆయా ఫిర్యాదుల పరిష్కార తీరును తెలియజేస్తుంది.

మే, 2024కు సంబంధించిన ప్రగతి ప్రకారం ఆయా కేంద్ర మంత్రిత్వశాఖలు, విభాగాలు 1,05,991 ఫిర్యాదులను పరిష్కరించాయి. జనవరినుంచి మే, 2024వరకు తీసుకుంటే ఆయా కేంద్ర మంత్రిత్వశాఖలు, విభాగాల సరాసరి ఫిర్యాదు పరిష్కార సమయం 12 రోజులుగా నమోదైంది. కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణ వ్యవస్థ ( సిపిజిఆర్ ఏ ఎం ఎస్) సంస్కరణల ప్రక్రియలోని 10 అంచెల ప్రక్రియలో భాగంగా ఈ నివేదికలను డిఏఆర్ పిజి అమలు చేస్తోంది. తద్వారా ఫిర్యాదుల నాణ్యతను పెంచడం, సమయాన్ని తగ్గించడం జరుగుతోంది.

మే, 2024లో పలు ఛానెళ్ల ద్వారా సిపిజిఆర్ ఏ ఎంఎస్ లో తమ పేర్లను నమోదు చేసుకున్న నూతన వినియోగదారుల వివరాలను నివేదికలో ఇచ్చారు. మే 2024లో మొత్తం 49486నూతన వినియోగదారుల ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ఉత్తరప్రదేశ్‌నుంచి అధికంగా 7323 వున్నాయి. తర్వాత మహారాష్ట్ర నుంచి 5290 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా మే, 2024లో నమోదైన ఫిర్యాదుల వివరాలను రాష్ట్రాలవారీగా కూడా ఈ నివేదిక పొందుపర్చింది. ఉమ్మడి సేవా కేంద్రాల పోర్టల్ తో సిపిజిఆర్ ఏ ఎంఎస్ ను అనుసంధానం చేయడంవల్ల అదిఇ 5 లక్షలకు పైగా ఉమ్మడ సేవా కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చింది. దాంతో రెండున్నర లక్షల గ్రామస్థాయి ఔత్సాహిక వ్యాపారవేత్తలు దీన్ని ఉపయోగించుకున్నారు. మే, 2024లో సిఎస్ సి లద్వారా 6011 ఫిర్యాదులు నమోదయ్యాయి.

మే, 2024లో ఫీడ్‌బ్యాక్ కాల్ సెంటర్ ద్వారా 71, 996 అభిప్రాయాలను సేకరించడం జరిగింది. మొత్తం అభిప్రాయాల్లో 49 శాతం పౌరులు తమ తమ ఫిర్యాదుల పరిష్కారం విషయంలో సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజా ఫిర్యాదుల కేసులు: మే, 2024లో సిపిజిఆర్ ఏ ఎంస్ పోర్టల్ ద్వారా 1, 09, 889 ఫిర్యాదుల నమోదయ్యాయి. వీటిలో 1,05, 991 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగింది. 31 మే, 2024 నాటికి పెండింగులో వున్న ప్రజాఫిర్యాదులు 81, 331.

ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా మే, 2024లో సి 6011 ఫిర్యాదులు నమోదయ్యాయి.

ప్రజల విజ్ఞప్తులు: మే , 2024 లో 17,306 విజ్ఞప్తలను స్వీకరించారు. వాటిలో 18,607 విజ్ఞప్తులను పరిష్కరించారు.

ఫిర్యాదుల పరిష్కార అంచనా మరియు సూచిక ( జిఆర్ ఏ ఐ)- మే, 2024

మే, 2024కు గాను విడుదల చేసిన ర్యాంకులలో గ్రూప్ ఏ కేటగిరీకి సంబంధించి రెవిన్యూ విభాగం, పరోక్ష పన్నులు మరియు సుంకాల విభాగం, తాగునీరు మరియు పారిశుద్ధ్యం విభాగం మొదటి స్థానం సంపాదించాయి.

మే, 2024కు గాను విడుదల చేసిన ర్యాంకులలో గ్రూప్ బి కేటగిరీకి సంబంధించి నీతి ఆయోగ్, పార్లమెంట్ వ్యవహారాల శాఖ, ఆయుష్ మంత్రిత్వశాఖలు మొదటి స్థానం సంపాదించాయి.

# బీసీల రాజకీయ చైతన్యంతో మారిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు.

**-కొనసాగుతున్న సామాజిక మార్పును ప్రధాన పార్టీలు గుర్తెరగాలి..**

**-బిజెపి కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షులుగా బీసీలకే అవకాశమివ్వాలి**

**-బీసీ రాజ్యాధికార సమితిదాసు సురేష్ ,అధ్యక్షులు**

హైదరాబాద్ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో మారుతున్న సామాజిక, రాజకీయ పరిణామాలను పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. బీసీల ఓటు బ్యాంకు పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు అత్యధిక సీట్లను కేటాయించిన పార్టీకి అగ్ర తాంబూలాన్ని అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.. బీసీలలో వస్తున్న రాజకీయ చైతన్యాన్ని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాన పార్టీలు గమనించాలని కోరారు.. త్వరలో ఎంపిక కాబడనున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్,బిజెపి అధ్యక్ష పదవులను బీసీ నేతలకే కట్టబెట్టాలని ప్రధాన పార్టీలను దాసు సురేశ్ డిమాండ్ చేశారు.. గత ప్రభుత్వంలో నలుగురు బీసీలకు మంత్రులుగా అవకాశాలు రాగా ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికీ కేవలం రెండు మంత్రి పదవులు మాత్రమే బీసీలకు దక్కయాన్ని,డిప్యూటీ సీఎం అవకాశాన్ని సహితం బీసీలకు కల్పించాలని దాసు సురేష్ తెలంగాణ ప్రభుత్వాన్ని,కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు .. మారుతున్న సామాజిక పరిణామాలను, బీసీలలో ఓటు చైతన్యాన్నిగమనించి గౌరవిస్తేనే భవిష్యత్తులో పార్టీలకు మనుగడ సాధ్యమన్నారు . బీసీల ఆకాంక్షలను అవకాశాలను అభ్యున్నతిని విస్మరిస్తే రాజకీయ పార్టీలకు అధోగతి తప్పదని హెచ్చరించారు..



# ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు

హైదరాబాద్ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు అందాయి. ఈనెల 15 లోగా వివరణ ఇవ్వాలంటూ జస్టిస్ నర్సింహారెడ్డి ఈ నోటీసులు జారీ చేశారు. కాగా విచారణకు హాజరయ్యేందుకు జులై 30 వరకు సమయం కావాలని కేసీఆర్ కోరారు.డు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు. మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు. నిన్న (సోమవారం) మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు.

**ఎంత నష్టం అనేది తేల్చాల్సి..**

కాగా మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు.

జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎన్‌కే జోషి, అరవింద్ కుమార్‌లతో ఇవ్వాళ (మంగళవారం) సమావేశం అయ్యామని చెప్పారు.

అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్‌ఘడ్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు.

భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి పేర్కొన్నారు.

ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేలైన్ వెయ్యలేదని పేర్కొన్నారు.

అధికారుల నుంచే కాకుండా ప్రముఖుల నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని అన్నారు.

# వీధి బాలలకు వెలుగెప్పుడు?



**- సాయి చౌదరి**

**-నేటి నుండి పాటశాలలు పునఃప్రారంభం**

హైదరాబాదు జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పిల్లలు సమాజానికి ఆస్తి లాంటివారు. వారి చేతుల్లోనే భవిష్యత్తు సమాజం ఆధారపడి ఉంది. పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యము, ఆహారం ఇస్తే వారు భవిష్యత్తులో కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి వెలుగుదివ్వెల వుతారు అని ప్రముఖ సామాజిక కార్యకర్త సాయి చౌదరి అన్నారు.

పాపము, పుణ్యము, ప్రపంచం తెలియని చిన్నారులను సమాజమే కాకుండా ప్రభుత్వాలు కూడా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఈ నిర్లక్ష్యమే దేశమంతటా ఎక్కడబడితే అక్కడ కనిపించే వీధి బాలల దృశ్యాలతో కారణమవుతున్నది. తల్లిదండ్రులు, పేదరికము, వెనుకబాటు తనంతో పిల్లల్ని కన్నా తరువాత పసిప్రాయంలోనే వీధుల్లో వదిలేస్తున్నారు. వారిని రక్షించేవారు సరైన క్రమశిక్షణతో సరైన విద్యను అందించి మంచి పౌరులుగా తయారు చేసే రక్షణ చత్రం కనిపించడం లేదు అని సాయి చౌదరి పేర్కొన్నారు.

బాల్యంలోనే చదువుకు, తల్లిదండ్రుల ఆదరణ, సమాజం వివక్షతకు గురైన వీధి పిల్లలు సరైన మార్గం తెలియక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఒకవైపు సమాజానికి ఇది జాడ్యంలో పరిణమిస్తే, మరోవైపు తల్లిదండ్రులే కుటుంబ పోషణ కోసం పిల్లలను బాల కార్మికులుగా వివిధ పనుల్లో నియమిస్తున్నారు.

అక్కడ బాల కార్మికులు బానిసలుగా బతుకుతున్నారు. యజమానులు కూడా ఎక్కువ పని గంటలు, తక్కువ వేతనము ఎదురు తిరగరనే భావనతో బాల కార్మికులను ఎక్కువగా పనిలో ఉపయోగించుకుంటున్నారు. మొత్తముగా పిల్లలను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులే కాకుండా సమాజము, ప్రభుత్వం కూడా సరైన రీతిలో చర్యలు తీసుకోవడం లేదు. ఫలితముగా మన బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ దాకా ఆలయాల నుంచి రెస్టారెంట్లు, టీ స్టాళ్ళు, బ్యాంకుల దాకా ఎక్కడబడితే అక్కడ 18 ఏళ్ల లోపు పిల్లలకు అడుక్కు తినడం కనిపిస్తుంది. చివరకు పట్టణాలలో జంక్షన్ల దగ్గర కూడా వీధి బాలలతో భిక్షాటన చేయించడం సాధారణంగా మారింది. ఆర్గనైజ్డ్ గ్యాంగులు వీధుల్లో దొరికిన బాలలను భిక్షాటనకు ఉపయోగించుకుంటున్నాయి. ఈ మాఫియా లక్షల నుండి కోట్లు సంపాదించేదాకా పెరిగింది. ఇక అమ్మాయిలైతే వారిని అంగటి సరుకుగా మారుస్తున్నారు. వ్యభిచార గృహాలకు విక్రయించి వారికి ఇష్టం లేకున్నాఆ వృత్తిలో బలవంతంగా దింపుతున్నారు.

బాలల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది బాల కార్మిక నిరోధ చట్టము, పిల్లల పరిరక్షణ, భద్రత కోసం మరో చట్టాన్ని తీసుకువచ్చారు. అలాగే పిల్లలు ఉచితంగా నిర్బంధంగా విద్య నేర్చుకోవడానికి మరో హక్కును, చట్టాన్ని రూపొందించారు. కానీ ఈ చట్టాలన్నీ సమర్థవంతంగా అమలు అయితే వీధుల్లో బాలలే కనిపించరు. బాల కార్మికులు కనిపించరు. కానీ ఈ చట్టాల అమలు లేదు. నియంత్రణ అంతకన్నా లేదు. పర్యవేక్షణ గురించి పట్టించుకునే వారు లేరు. ఫలితంగా ఇవి కాగితపు పులులుగా మారిపోయాయి. కానీ ఎక్కడా వీధి బాలల గురించి వారి చీకటి జీవితాల గురించి వారిని వెలుగులోకి తీసుకురావడం గురించి ఎవరు ఆలోచించరు. కొంతమేరకు బాల కార్మికుల హక్కుల ఉద్యమంలో పాలుపంచుకుంటున్న ఎన్జీవోలు క్రియాశీల పాత్ర నిర్వహిస్తున్నాయి. ఎక్కడైనా వీధి బాలల కనిపిస్తే వారిని వెంటనే ప్రభుత్వ సంక్షేమ సెంటర్లకు తరలిస్తున్నారు. వారికి నీడ, కూడు, గూడు, విద్యా లభించేలా స్థానిక యంత్రాంగం పై ఒత్తిడి తెస్తున్నారు అని సాయి చౌదరి తెలిపారు

కానీ ప్రభుత్వం నుంచి, పాలకుల నుంచి, సమాజం నుంచి వీధి బాలల సంక్షేమం గురించి పట్టించుకునే వ్యవస్థ కరువైంది. ఫలితంగా సమాజంలో బాల కార్మిక వ్యవస్థతో పాటు వీధి బాలల సమస్య ఆందోళనకరంగా పెరిగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో వీధి బాలల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. అలాగే పిల్లలు ఇంట్లో ఉండి కూడా తల్లిదండ్రుల చేత నిరాదరణకు, వారి దౌర్జన్యాలకు గురవుతున్న సంఘటనలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో పిల్లల రక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం పై ఎంతో శ్రద్ధ పెడతారు. అక్కడ పిల్లల్ని తల్లిదండ్రులు, టీచర్లు, బంధువులు ఎవరూ నిందించిన చివరకు కొట్టిన అది నేరమవుతుంది. ఆ నేరంలో బాధ్యులు జైలుకు కూడా వెళ్తారు. శిక్షలకు గురవుతారు. కానీ మన దేశంలో తల్లిదండ్రుల చేతనే అనేక శిక్షలకు గురవుతున్న సంఘటనలు సర్వసాధారణంగా మారాయి.

ఇక స్కూళ్లలో టీచర్ల అకృత్యాలకు అంతే లేకుండా పోతుంది. మొత్తముగా సమాజానికి బహుముఖంగా ఉపయోగపడాల్సిన బాలలు సరైన రక్షణ లేక భద్రత లేక సంక్షేమం లేక హక్కులు లేక దిక్కుతోచని మార్గంలో పయనిస్తున్నారు. ఫలితంగానే బాల నేరాలు కూడా పెరుగుతున్నాయి. ప్రపంచంలో ఒక అంచనా ప్రకారం 380 మిలియన్ల దాకా వీధి బాలలు ఉంటే అందులో 10 మిలియన్ల దాకా ప్రమాదకరమైన, అనారోగ్యకరమైన వృత్తులలో బాలలు నరకం అనుభవిస్తున్నారు.

రాక్ పిక్కింగ్ నుంచి మొదలుకుంటే దొంగతనాలు, కిడ్నాప్లు, అత్యాచారాలు లాంటి తీవ్ర నేరాలలో కూడా వీధి బాలలు భాగస్వాములు అవుతున్నారు. తల్లిదండ్రులు, టీచర్లు, పాలకులు ఇప్పటికైనా మేల్కొని వారి రక్షణ కోసం నడుం బిగించాలి. ఎక్కడ వీధి బాలల కనిపించిన వారిని రక్షించి సరైన షెల్టర్లకు తరలించాలి. ఎక్కడ బాల కార్మికులు కనిపించిన వారి గురించి అధికారులకు ఫిర్యాదు చేయాలి. మానవ రవాణా, వ్యభిచారము, ప్రమాదకరమైన వృత్తులలో ఎక్కడ బాలలు కనిపించినా వాటి గురించి పోలీసులు ఫిర్యాదు చేసి వారు ఆ మార్గం నుంచి బయటపడి సామాజిక ప్రవంతిలో కలిసేలా కృషి చేయాలి. ఎన్జీవోలు ఈ విషయంలో కొంతముందు ఉన్న వారి సంఖ్య చాలా తక్కువ ఉండటంతో సమాజము, ప్రభుత్వమే వీధిబాలల పరిరక్షణకు ఉద్యమం లాంటిది చేపట్టాలని ప్రముఖ సామాజిక కార్యకర్త సాయి చౌదరి పేర్కొన్నారు.

## గొర్రెల స్కామ్.. 2వ రోజు కస్టడీ విచారణ..

హైదరాబాద్ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ లో గొర్రెల స్కామ్ దర్యాప్తులో ఏసీబీ అధికారులు స్పీడ్ పెంచారు. నిందితులను ఏసీబీ అధికారులు కస్టడీ లోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండవరోజు మంగళవారం మాజీ పశు సంవర్ధక శాఖ ఎండీ రాంచందర్ నాయక్, ఓఎస్డీ (రాజా) కళ్యాణ్ లను విచారించన ున్నారు. మొదటిరోజు సోమవారం కస్టడీ విచారణలో రామచందర్.. నోరు మెదపలేదు. అలాగే ఓఎస్డీ కళ్యాణ్ కూడా విచారణకు సహకరించలేదు. గొర్రెల స్కీము యూనిట్ కాస్ట్ పెంపు, దళారుల ప్రమేయంపై ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఎవరి ప్రమేయంతో దళారి, భోగస్ కంపెనీతో గొర్రెలను రైతులకు కొనుగోలు చేసి ఇవ్వాలని ఆదేశించారన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. రామచందర్, కళ్యాణ్‌లను ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారిస్తున్నారు. ఈరోజు కస్టడీ విచారణలో రాజకీయ నాయకుల పాత్ర, ఓఎస్డీ కళ్యాణ్ ఫైల్స్ తరలింపు, కాల్చివేత వీటన్నింటిపై ఏసీబీ అరా తీస్తోంది .కాగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న పశు సంవర్ధక శాఖ మాజీ ఎండీ రామ్ చందర్ నాయక్.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ కళ్యాణ్ కుమార్‌లను మూడు రోజులపాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో సోమవారం వారిని కస్టడీలోకి తీసుకుని అధికారులు విచారించారు. కాగా గొర్రెల స్కామ్‌లో ఇప్పటికే 10 మందిని నిందితులుగా గుర్తించి పలువురిని అరెస్ట్ చేశారు. గొర్రెల స్కామ్‌లో మొదట రూ. 2.10 కోట్లు దారి మళ్ళినట్టు గుర్తించారు. పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామ్ చందర్ నాయక్ , ఓఎస్డీ కళ్యాణ్ అరెస్ట్‌తో రూ. 700 కోట్ల స్కామ్ జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. దీనికి సంబంధించి కీలక ఆధారాలు సేకరించింది. కస్టడీ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ మోహినూద్దిన్ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# రేవంత్ ఇంటి వద్ద గురుకుల టీచర్ల నిరసన




హైదరాబాద్, జూన్ 11 :జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు మంగళవారం గురుకుల టీచర్ అభ్యర్థులు నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను గురుకుల టీచర్ అభ్యర్థులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ చేతులెత్తి దండం పెడుతూ వేడుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అలాగే జీతాలు రావట్లేదని సీఎం ఇంటి వద్ద నర్సింగ్ స్టాఫ్ నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

గాంధీభవన్ దగ్గర ఏఈఈ అభ్యర్థులు నిరసన చేపట్టారు. డాక్యుమెంటేషన్ జరిగి నెలలు గడుస్తున్నా తమకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదంటూ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అభ్యర్థులు వాపోయారు. మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని అభ్యర్థుల ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే ఇవాళ గాంధీ భవన్ దగ్గర మోకాళ్ల మీద కూర్చొని ఏఈఈ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. మార్చ్ లో 1:2 రేషియోలో అభ్యర్థులను కమిషన్ సెలెక్ట్ చేసింది. డాక్యుమెంటేషన్ జరిగి మూడు నెలలు గడిచినా కమిషన్ అపాయింట్మెంట్ లేటర్లు ఇవ్వలేదని అభ్యర్థులు వాపోయారు.

# వరుసగా రెండోసారి రక్షణ శాఖ మంత్రిగా రాజ్ నాథ్ సింగ్

న్యూఢిల్లీ, జూన్ 11 :2019 నుంచి 2024 వరకు విజయవంతంగా తన మంత్రిత్వ శాఖను నిర్వహించిన రాజ్ నాథ్ సింగ్ కు ప్రధాన మంత్రి సూచన మేరకు రాష్ట్రపతి వరుసగా రెండోసారి రక్షణ శాఖను కేటాయించారు. ఉత్తర ప్రదేశ్ లోని లక్నో పార్లమెంటు సభ్యుడైన శ్రీ రాజ్ నాథ్ సింగ్ 2019 జూన్ 01 న మొదటిసారిగా రక్షణ మంత్రిత్వ శాఖ అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.

రాజ్ నాథ్ సింగ్ 1951 జూలై 10న ఉత్తరప్రదేశ్ లోని చందౌలీ జిల్లాలో జన్మించారు. గోరఖ్ పూర్ విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రం లో మాస్టర్స్ చేశారు. ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. 1977 - 1980 మరియు 2001 - 2003 మధ్య కాలం లో ఉత్తర ప్రదేశ్ శాసనసభ సభ్యుడిగా పనిచేశారు . 1991 - 1992 లో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశాడు. 1999 నుంచి 2000 వరకు కేంద్ర కేబినెట్లో ఉపరితల రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు.

ఆ తర్వాత 2000 ? 2002 సమయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గా తన భాధ్యతలు నిర్వర్తించారు. 2003లో కేంద్ర మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1994-1999, 2003-2008లో రెండు పర్యాయాలు రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2009లో 15వ లోక్ సభకు ఎన్నికయ్యారు. 2009 అక్టోబరు 7న ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా కూడా పనిచేశారు. శ్రీ రాజ్ నాథ్ సింగ్ 2014, మే 27న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో హోం మంత్రిగా కేంద్ర మంత్రివర్గంలో చేరారు. ఆయన శ్రీమతి సావిత్రి సింగ్ ను వివాహం చేసుకున్నారు, వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

జార్ఖండ్ లోని రాంచీకి చెందిన పార్లమెంటు సభ్యుడు శ్రీ సంజయ్ సేథ్ కు రక్షణ మంత్రిత్వ శాఖలో సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. సంజయ్ సేథ్ 2019లో తొలిసారిగా రాంచీ నుంచి ఎంపీగా ఎన్నికై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. 2024లో కూడా రాంచీ నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు

# నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

**- హాజరైన ఎమ్మెల్యే,సంఘం నేత**

**- ఇరువురికి ఘనంగా సన్మానం**

ఖమ్మం, జూన్ 11 :(నేటినిజం ప్రతినిధి): వైరా నియోజవర్గ స్థాయి నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా హాజరైన వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షులు గజ్జల వెంకన్న లను కొణిజర్ల నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అతిధులను ఘనంగా శాలువతో, పూలమాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మండల నాయిబ్రాహ్మణ అధ్యక్షులు కొలిపాక వెంకటేశ్వర్లు, నాయిబ్రాహ్మణ కొణిజర్ల గ్రామ అధ్యక్షులు కోలిపాక వీరబాబు, కొణిజర్ల నాయిబ్రాహ్మణ ముఖ్య సలహాదారుడు, కొణిజర్ల మండల కాంగ్రెస్ నాయకులు గుడివాడ వెంకటేశ్వర్లు, కుదురుపాక రమేష్, బెజవాడ రాంబాబు, బెజవాడ మణికంఠ, బెజవాడ నాగరాజు, అద్దంకి నాగరాజు, తదితరులున్నారు.

## 13మంది ఇన్ స్పెక్టర్ల బదిలీ.. ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ

కరీంనగర్, జూన్ 11 : మల్టీ జోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజిపి ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్ని శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పోలీస్ శాఖ లో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. మల్టీజోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

# మోత్కూర్ సింగిల్ విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం..



నల్గొండ, జూన్ 11 :యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ సింగిల్ విండో చైర్మన్ కంచర్ల అశోక్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ఇవాళ ఉదయం 11 గంటలకు జరగాల్సి ఉండగా, జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి ఉదయం 11:30 వరకు కూడా రాకపోవడంతో నేరుగా క్యాంప్ నుండి వచ్చిన 9మంది డైరెక్టర్ లు కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ఎన్నికల అధికారి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. మెజార్టీ సభ్యులు హాజరు కావడంతో చైర్మన్ పై అవిశ్వాసం నెగ్గినట్లు భావించాలని డిమాండ్ చేశారు.

సింగిల్ విండో లో చైర్మన్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడు కాబట్టేసదరు జిల్లా సహకార అధికారి.. చైర్మన్ అశోక్ రెడ్డి ప్రలోభాలకు లొంగి అవిశ్వాస ఓటింగ్ కి ఎన్నికల అధికారి హాజరు కాకపోవడం పట్ల తీవ్ర నిరసన తెలిపారు.

సహకార ఉన్నతాధికారులు డి సి ఓ ను సస్పెండ్ చేసి, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. రామన్నపేట సి ఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి లు భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తుండగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చైర్మన్ తో సహా డీసీఓ ఆలస్యంగా రావడంతో కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. డీసీఓ లంచం తీసుకున్నాడనీటూ తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలని నిరసనలు తెలిపారు.

# ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు..



**-ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలి**

**-లైసెన్సులను తప్పనిసరిగా కలిగి ఉండాలి**

**-నిబంధనలు ఉల్లంఘించిన రెస్టారెంట్లు, హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం**

**- ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మనోజ్**

మహబూబ్‌నగర్, జూన్ 11 : అపరిశుభ్రత పరిసరాల్లో ఆహార పదార్థాలు తయారు చేసిన, కల్తీ పదార్థాలను ఉపయోగించిన సంబంధిత హోటళ్లు, రెస్టారెంట్లను సీజ్ చేసి సంబంధిత యజమానులపై చట్టరీత్యా కేసులు నమోదు చేయబడతాయని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ హెచ్చరించారు. ఇవాళ అచ్చంపేట పట్టణంలోని అమృతపాణి అరేబియన్ మండి రెస్టారెంట్, హోటల్ పరివార్, నేషనల్ హోటల్, హాజీపూర్ చౌరస్తాలోని బటర్ ఫ్లై హోటల్, అచ్చంపేట పట్టణంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు.

ఆహార పదార్థాల్లో కల్తీ ఉత్పత్తులు, కలర్లు వాడరాదని, అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేయరాదని, మాంసపు ఆహారాల్లో ఉపయోగించే చికెన్, మటన్, చేప మొదలు వాటిని ఏ రోజుకు ఆ రోజు కొనుక్కొని వాడాలని, కొనుగోలు చేసిన వారి నుండి రసీదులు తీసుకొని భద్ర పరచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల్లో తాజా సరుకులను ఉపయోగించాలని, కాలం చెల్లిన పదార్థాలను అసలు కలిగి ఉండరాదని హెచ్చరించారు.

రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు కచ్చితంగా లైసెన్సు కలిగి ఉండాలని, లేనిచో వారిపై చర్యలు తీసుకొనబడునని, లైసెన్సు ఉల్లంఘించిన వారిపై ఆరు నెలల జైలు శిక్ష, ఐదు లక్షల రూపాయల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. అమృతపాణి అరేబియన్ మండి రెస్టారెంట్లో కాలం చెల్లిన పరోటాలను అక్కడికక్కడే పడేయించారు. తనిఖీలు చేసిన అన్ని హోటళ్లలోని ఆహార పదార్థాలను శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపిస్తున్నామని, ల్యాబ్ రిపోర్టులో కల్తీ ఉన్నట్టు తేలితే సంబంధిత హోటళ్లు సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. లైసెన్సులు రెన్యువల్ చేయించుకోని వారికి నోటీసులు ఇచ్చారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో అధిక మోతాదులో కలర్ ను ఉపయోగించిన మంచూరియాలను నేలపాలు చేశారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఆఫీస్ సబార్డినేట్ వజిత్ వెంట ఉన్నారు.

## సింధు శిఖర్ కార్ ర్యాలీ ప్రారంభానికి గుర్తు జెండాను చూపెట్టే కార్యక్రమం

న్యూఢిల్లీ, జూన్ 11 :ఢిల్లీ నుండి లేహ్ కు వెళ్ళి తిరిగి వచ్చేందుకు ఉద్దేశించిన సింధు శిఖర్ కార్ ర్యాలీ కి చీఫ్ ఆఫ్ పర్సనెల్ వైస్ ఎడ్ మరల్ శ్రీ సంజయ్ భల్లా 2024 జూన్ 10 వ తేదీ న న్యూఢిల్లీ లో జెండా ను చూపెట్టడం ద్వారా ఆ ర్యాలీ ని ప్రారంభించారు. భారతదేశం యొక్క సుసంపన్నమైనటువంటి సముద్ర సంబంధి వారసత్వాన్ని గురించి న చైతన్యాన్ని ఉత్తరాది రాష్ట్రాల లో వ్యాప్తి చేయాలన్నది ఈ యాత్ర యొక్క ప్రధానోద్దేశ్యం.

నలభై మంది నౌకా దళ ఉద్యోగుల తో కూడిన ఈ యాత్ర మారుమూల ప్రాంతాల గుండా సాగుతూ 18 రోజుల లో 3637 కిలో మీటర్ ల మేర కలియదిరుగనుంది. భారతీయ నౌకా దళం యొక్క పౌర సంబంధాల కార్యక్రమాల లక్ష్య సాధన లో ఈ యాత్ర ఒక ప్రధానమైన మైలురాయి కాగలదు. ముఖ్యం గా పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము మరియు కశ్మీర్, ఇంకా లద్దాఖ్ ల లోని పలు ప్రాంతాల లో పాఠశాల లు, కళాశాల లు మరియు ఎన్‌సిసి విభాగాలకు చెందిన వారి తో మాటామంతీ జరపడం తో పాటుగా చండీగఢ్ లో నిర్వహించే ఒక కార్యక్రమం లో పూర్వ సైనికులతో సంభాషించడం ఒక భాగం గా ఉండబోతున్నది. విద్యార్థుల తో మాటలాడే క్రమం లో, భారతీయ నౌకా దళం లో చేరడం ఎలాగో యువత కు తెలిపేందుకు జట్టు సభ్యులు కొన్ని ప్రదర్శనలను సమర్పించడం తో పాటు గా సాయుధ దళాల లో యువత చేరేటట్టు గా వారిలో ప్రేరణ ను కలిగించనున్నారు.

## ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ డి.మధుసూదన్

ఖమ్మం, జూన్ 11 :(నేటినిజం ప్రతినిధి): ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు.

సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రెవిన్యూ అధికారులతో ధరణి, రిజిస్ట్రేషన్ల పెండింగ్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్లైన్ అప్లోడ్ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు.

తహశీల్దార్లు ఫిజికల్ ధరణి ఫైళ్లను అప్లోడ్ చేస్తే, ఆర్డీవోల లాగిన్ కు వస్తాయని, ఆర్డీవోలు పరిశీలించి అదనపు కలెక్టర్ కు సమర్పించాలని అన్నారు. పెండింగ్ స్లాట్ల పరిష్కారం పూర్తి చేయాలన్నారు.

పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు.


ఆహ్వానం

**శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య**

మరియు

ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

తేది :19-06-2024, బుధవారము, సమయం : సా॥ 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | శ్రీ ఎమ్. జగన్ మోహన్ రెడ్డి I.P.S. (Retd.) |
| సభాధ్యక్షులు | : | శ్రీ పొత్తూరి పవన్ కుమార్ ప్రముఖ పారిశ్రామికవేత్త |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా జనార్థన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గాన సభ. |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం. |
| ప్రత్యేక ఆహ్వానితులు | : | డా॥ పి.ఎస్. దత్తాత్రేయ Oncology Specialist |
| పురస్కార గ్రహీత | : | శ్రీమతి డా॥ భుక్య శ్వేత Oncology Specialist |
| ఆత్మీయ అతిథి | : | శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి, మేనేజర్, సాహితి కిరణం |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజ రామ మోహన రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్. |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని. |

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి



శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650


# శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే..



అమరావతి, జూన్ 11 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామిని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇవాళ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. దర్శనానంతరం ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ? పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నామన్నారు.

# పెండింగ్ పనులు ఎందుకు చేయడం లేదు: ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## -కమిషనర్, అధికారులపై ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం
## -పక్షపాత ధోరణితో పనిచేస్తున్నారంటూ మండిపాటు

హైదరాబాద్, జూన్ 11 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి.. తీర్మానం చేయకుండా రూ. 12 లక్షల నిధులతో షో లైట్లు



ఎలా ఏర్పాటు చేస్తారని బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి. నాలుగు రోజుల కిందటే అభివృద్ధి పనులపై సమీక్ష ఉన్నదని చెప్పినా..నిర్లక్ష్యంగా వ్యవహారించడంపై మండిపడ్డారు. కమిషనర్, ఇతర అధికారులు ఎందుకు పక్షపాత ధోరణిలో పనిచేస్తున్నారని ప్రశ్నించారు. తీరు మార్చుకోక పోతే ఇబ్బంది అవుతుందన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

బడంగ్‌పేటలో ప్రధాన రహదారి పై స్తంభాలు వేయిస్తే తెలియకుండా షో లైట్లు ఏర్పాటు చేయడం పై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తనకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహించారు. 'అంతా మీ సొంత ఆలోచనతో చేస్తున్నారా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల ముందే బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం ఉన్నదని చెప్పినా.. కమిషనర్ రఘుకుమార్ నిర్లక్ష్యంగా వ్యవహారించడంపై ఆమె మండిపడ్డారు. వర్షాకాలం వచ్చిన తర్వాత కూడా ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పక్కన పెట్టి హైమాస్ట్ లైట్లు ఉండగా, స్తంభాలకు షో లైట్లు పెట్టమని ఎవరూ చెప్పారని ఆమె నిలదీశారు. టెండర్ లేకుండా పనులు ఎలా చేస్తారన్నారు.

రూ. 12 లక్షలతో కొంత మేరకు పనులు చేసి మరో రూ. 12 లక్షలు బిల్లు పెడుతారా.. అని అన్నారు. లైట్లు వేసిన కాంట్రాక్టర్ శ్రీనివాస్ గౌడ్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేశారు. ఎవరూ చెబితే పనులు చేశావంటూ.. ప్రశ్నించారు. వేసిన లైట్లు తీసుకొని వేరే చోట వేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా, ఎలాంటి తీర్మానాలు లేకుండా పనులు చేయడం పట్ల ఆమె మండిపడ్డారు. ఒక వర్గం వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, తాము చెబితే కమిషనర్ పనులు చేయడం లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులు ప్రభుత్వ భూములు, పార్కులు, సీలింగ్ భూములు, , వర్క్ బోర్డు భూముల్లో డోర్ నంబర్లు ఇస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చాలా వరకు పనులు అసంపూర్తిగా ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా కొత్త వాటిని చేయాలని ఎందుకు అనుకుంటున్నారని, ఏ వార్డుకు ఎన్ని నిధులు కేటాయించారో పూర్తి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. టెండర్ లేకుండా పనులు చేయకూడదన్నారు. నాలా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్, డీఈ జ్యోతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు..

హైదరాబాద్, జూన్ 11 :ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికి నిందితులుగా ఉన్న నలుగురు పోలీసులను అరెస్టు చేయగా.. నిందితులుగా మాత్రం ఆరుగురి పేర్లను చేర్చారు. అరెస్టు అయిన నలుగురిలో ఇప్పటి వరకు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావును పోలీసులు అరెస్టు చేశారు.

మరోవైపు, భుజంగరావు, తిరుపతన్నలు తమకు బెయిల్ ఇవ్వాలని నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తమను రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే వారిని ఇంకా విచారించాల్సి ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. ఇద్దరి బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. ఈ విషయంలో నాంపల్లి కోర్టు తీర్పును బుధవారం (జూన్ 12) వెల్లడించనుంది.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలియజేసిన రాపర్తి ప్రసాద్..

కరీంనగర్, జూన్ 11 : (నేటినిజం ప్రతినిధి) బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులైన నేపథ్యంలో మంగళవారం రోజున బిజెపి జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్ ఢిల్లీలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రావర్తి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం బిజెపి కార్యకర్తలకు స్పూర్తిదాయకమన్నారు. పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడి సామాన్య కార్యకర్త నుండి కేంద్రమంత్రి స్థాయి వరకు బండి సంజయ్ కుమార్ రాణించగలిగారన్నారు .



# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య




హన్మకొండ, జూన్ 11 : (నేటినిజం ప్రతినిధి)గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రోపియట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బి.వి. నిర్మలా గీతాంబ తో కలసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ? జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి ఫోటోలు కూడా తీయాలని, సంబంధిత ఫారం లు తప్పని సరిగా చెక్ చేయాలని, అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్ల ను గుర్తించి వాటిపై రహస్య ఆపరేషన్లు నిర్వహించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యుక్త వయసులో ఉన్న యువత కు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. యుక్త వయసులో వచ్చే మార్పులపై అన్ని కళాశాలల్లో యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. భ్రూణ హత్యలను నివారించి, జిల్లాలో బాలికల నిష్పత్తి పెరిగేటట్లు చూడాలని కోరారు. ఈ సమావేశంలో డిసిపి రవి, డెప్యూటీ డి ఎం హెచ్ ఓ ప్రకాష్, ప్రాజెక్ట్ అధికారి పద్మశ్రీ, మాస్ మీడియా అధికారి అనిల్ , ఏసీపీ కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ బాబురావు, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై జనం గగ్గోలు.. ప్రజావాణికి వెల్లువలా ఫిర్యాదులు



హైదరాబాద్, జూన్ 11 :'గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌హిల్స్‌లో సర్వే నంబర్ 66/2లో ప్లాట్ నంబర్ 178/పార్ట్‌లో జీ+4 అంతస్తులకు అనుమతి తీసుకొని ఏడు అంతస్తుల నిర్మాణం చేపట్టారు. సెడ్‌బ్యాక్ ఉల్లంఘన భారీగా జరిగింది. ఈ అక్రమ నిర్మాణాన్ని ఆపాలని జీహెచ్ఎంసీ జోనల్, ప్రధాన కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదు చేశాం. ప్రజాభవన్‌లో ప్రజావాణికి ఫిర్యాదు చేశాం. ఫిర్యాదును పరిష్కరించిన పాపాన పోలేదు.

సదరు అక్రమ నిర్మాణంలో హాస్టల్ వచ్చేసింది. ఈ నిర్మాణంతో స్థానికంగా అనేక ఇబ్బందులు వస్తున్నాయి' అంటూ గాయత్రి అనే మహిళ జీహెచ్ఎంసీ ప్రజావాణి వేదికగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముందు కన్నీటి పర్యవంతమయ్యారు. ఏడాది కాలంగా ఆమె చేస్తున్న పోరాటం ఫిర్యాదుదారులను తీవ్రంగా కలిచివేసింది. స్పందించిన మేయర్.. సీసీపీ రాజేంద్రప్రసాద నాయక్ నుంచి రెండు రోజుల్లో సమగ్ర నివేదికను తెప్పించుకుని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్క గాయత్రే కాదు.. ఉప్పల్, ఇతర ప్రాంతాల నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారుల అక్రమాలు, అనధికారిక నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదుదారులు గగ్గోలు పెట్టారు.

కాలయాపన చేస్తున్నారంటూ..

జీహెచ్ఎంసీలో విధులు నిర్వర్తించే సంబంధిత శాఖల అధికారులు ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా పొంతన లేని సమాధానాలతో కాలయాపన చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు జీహెచ్ఎంసీలో ప్రజలకు సమస్యలను సృష్టించేది అధికారులేనంటూ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులే అధిక సంఖ్యలో వచ్చాయి. అధికారులు సమస్యలను పరిషరించకుండా కాలయాపన చేస్తూ తనను అనారోగ్యం పాలు చేశారంటూ శేరిలింగంపల్లి జోన్ రాయదుర్గం ప్రాంతానికి చెందిన గాయత్రి ప్రజావాణిలో దరఖాస్తు చేస్తూ బోరున విలపించారు.

అక్రమ కట్టడాన్ని చేపడుతున్నారంటూ ఫిర్యాదు చేశానని.. చర్యలు తీసుకోవాలంటూ.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. పైగా అక్రమారులతో చేతులు కలిపిన టౌన్ ప్లానింగ్ అధికారులు.. అక్రమ కట్టడాలకు అండగా దగ్గరుండి కట్టడాలకు సహకరించారంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తనకు జరిగిన అన్యాయం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ మేయర్, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. మొత్తంగా ప్రధాన కార్యాలయంలో 45 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.

వెల్లువలా ఫిర్యాదులు

గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిషారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి దరఖాస్తుల వెల్లువలా వచ్చాయి. మూడు నెలలుగా రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి నిలిచిపోయింది. ఈ నెల 6న కోడ్ ముగియడంతో సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్ వ్యక్తిగత సెలవు పై వెళ్లడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా..

సరైన పద్ధతిలో స్పందించడం లేదని చెప్పారు. తప్పులు చేసిన వారికి సహకరిస్తూ ఇబ్బందులు పడుతున్న వారికి అన్యాయం చేసే విధంగా అక్రమారులకు సలహాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారంటూ బాధిత ప్రజలు అధికారుల ముందు తమ గోడును చెప్పుకున్నారు. ఏండ్ల తరబడి అధికారుల దృష్టికి సమస్యలను తీసుకొచ్చినా.. జోనల్ ఆఫీస్, సరిల్ ఆఫీస్ ల చుట్టూ తిప్పడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వర్షాకాలం ప్రారంభం అయినా ఇప్పటికీ నాలాల్లో వ్యర్థాలను తొలగించలేదని, ప్రజావాణిలో మేయర్‌కు బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు.

మేడ్చల్, సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 62 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి 90 దరఖాస్తులను స్వీకరించారు.

# కేంద్ర హోంశాఖ మంత్రిగా అమిత్‌షా.. ఆరోగ్య శాఖ మంత్రిగా జేపీ నడ్డా బాధ్యతలు

న్యూఢిల్లీ, జూన్ 11 :మోదీ 3.0 కేబినెట్ మంత్రులకుశాఖలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంతా ఇవాళ ఆయా శాఖల బాధ్యతలు స్వీకరించారు. తమకు కేటాయించిన శాఖలకు సంబంధించి మంగళవారం ఉదయం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. కేంద్ర మంత్రులుగా జై శంకర్, అశ్వినీ వైష్ణవ్, భూపేంద్ర యాదవ్, గిరిరాజ్ సింగ్, మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు బాధ్యతలు చేపట్టారు.

తాజాగా కేంద్ర హోం శాఖ మంత్రి గా అమిత్ షా వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం శాఖ మంత్రిగా జేపీ నడ్డా బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నడ్డాను.. మోదీ తొలిసారి తన కేబినెట్‌లోకి తీసుకున్న విషయం తెలిసిందే. నడ్డాతోపాటు అనుప్రియా పటేల్, జాదవ్ ప్రతాప్రావు గణపత్‌రావ్ కూడా సహాయ మంత్రులు బాధ్యతలు చేపట్టారు.

# ప్రయాణికుడి తల పగలగొట్టిన ఆర్టీసీ డ్రైవర్

హైదరాబాద్, జూన్ 11 : ఆర్టీసీ బస్సు ఆపమన్నందుకు ఓ ప్రయాణికుడిపె బస్సు డ్రైవర్‌దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..రాజలింగం అనే ప్రయాణికుడు రామాయంపేట వెళ్లడానికి మేడ్చల్‌లో ఆర్టీసీ బస్సు (టీఎస 10 జెడ్ 9847) కనిపించడంతో చెయ్యెత్తి బస్సును ఆపమని అభ్యర్థించాడు. బస్సు ఆపకపోవడంతో ప్రయాణికుడు డ్రైవర్‌ను తిట్టాడు. దీంతో ఆగ్రహం చెందిన బస్సు డ్రైవర్ బస్సును పక్కకు ఆపి రాజలింగం తలపై కర్రతో గట్టిగా కొట్టాడు. ఈ ఘటనలో ప్రయాణికుడికి తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తలసాని శంకర్ యాదవ్‌కు నివాళులు అర్పించిన కేటీఆర్



హైదరాబాద్, జూన్ 11 :మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు.

అనంతరం మోండా మార్కెట్ నుంచి బన్సీలాల్ పేటలోని గ్రేవ్ యార్డ్ వరకు సాగిన అంతిమ యాత్రలో కేటీఆర్, మాజీ మంత్రులు మహమూద్ అలీ, పద్మారావు గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ళ శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్వే సత్యనారాయణ, రోహన్ రెడ్డి, శంకర్ యాదవ్ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. కాగా, శంకర్ యాదవ్(61) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించారు.

# ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి, జూన్ 11 : అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.

ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.

ఆలయంలో జూన్ 16న సాయంత్రం శాస్త్రోక్తంగా వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుందని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం, సాయంత్రం నిర్వహించే వాహన సేవల వివరాలను ప్రకటించారు.

# చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి జూనియర్ ఎన్టీఆర్‌కు ఆహ్వానం

అమరావతి, జూన్ 11 : ఏపీ నూతన సీఎంగా తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. గన్నవరంలో బుధవారం ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఇప్పటికే విశిష్ట అతిథిగా ఏపీ ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందుకున్నాడు సినీ నటుడు పద్మవిభూషణ్ చిరంజీవి. ఇక చిరంజీవితో పాటు తాజాగా మరో నటుడికి ఆహ్వానం అందింది.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు ఆహ్వానం అందింది. అయితే దేవర షూటింగ్‌లో భాగంగా ప్రస్తుతం గోవాలో ఉన్నాడు తారక్. ఇక షూటింగ్ ఆపుకోని రేపు ప్రమాణ స్వీకారానికి తారక్ హాజరు అవుతాడా లేదా అనేది తెలియాల్సి ఉంది.

# భారత గడ్డపై హాకీ వరల్డ్ కప్..

హైదరాబాద్, జూన్ 11 :భారత గడ్డపై త్వరలో మరో ప్రపంచకప్ పోటీ జరగనుంది. ప్రతిష్టాత్మక ఎఫ్ఐహెచ్ హాకీ పురుషుల జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మెగా టోర్నీకి సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ఆతిథ్య హక్కులను భారత్‌కు అప్పగించింది. ఈ విషయాన్ని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టర్కీ మంగళవారం తెలిపారు.

ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ ప్రపంచ కప్ టోర్నమెంట్ వచ్చే ఏడాది (2025) డిసెంబర్‌లో ప్రారంభమవుతుంది. అయితే ఈసారి రికార్డు స్థాయిలో టైటిల్ కోసం 24 జట్లు పోటీపడడం విశేషం. గతంలో భారత్‌లో ఈ టోర్నీ మూడుసార్లు జరిగింది. 2013, 2016, 2021లో కాగా, భారత్ ఈ పోటీలకు ఆతిథ్యమివ్వడం ఇది నాలుగోసారి.

# ఎంఎంటీఎస్ రైల్లోంచి జారిపడి యువకుడి మృతి

హైదరాబాద్, జూన్ 11 : ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని బోయిగూడ ప్రాంతానికి చెందిన హరినాథ్ కుమారుడు జనసూర్య (20)ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు.

ఫలక్‌నామ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లడానికి ఎంఎంటీఎస్ రైల్లో ప్రయాణిస్తుండగా యాకత్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి జనసూర్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com